తరంగాలు

రిపోర్టర్లు కావలెను

అతి తక్కువ కాలంలో తెలుగు రాష్ట్రాల్లో అత్యంత ప్రజాదరణ పొందుతున్న 'తరంగాలు' జాతీయ దినపత్రిక నందు పనిచేయుటకు తెలంగాణ, ఆంధ్రప్రదేశ్‌లోని అన్ని జిల్లాలోని అన్ని మండలాల నుండి రిపోర్టర్లు కావలెను.

సంప్రదించండి...

94949 23460



ఎడిటర్ : గద్దం నాగరాజు

RNI . TELTEL / 2022 / 83463

జాతీయ దిన పత్రిక

# తరంగాలు

Tharangalu Daily News Paper

ప్రతి అక్షరం.... సామాన్యుడి అస్త్రం...

హైదరాబాద్

బుధవారం

07 ఫిబ్రవరి 2024

సంపుటి: 01

సంచిక: 250

పేజీలు: 8

వెల రూ.5.00


Epaper: www.tharangalu.com

Published From:Hyderabad, Circulated to: Hyderabad,Nalgonda,Khammam,Rangareddy,Sangareddy,Warangal,Kurnool,Kadapa, Amaravathi,Krishna


## కాంగ్రెస్ సర్కారు మూర్ఖపు వైఖరిని

# తిప్పికొట్టాలి

- ప్రజల హక్కులను కాపాడేందుకు పోరాటానికి సిద్ధం
- బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు



**తరంగాలు/ హైదరాబాద్ :** కాంగ్రెస్ ప్రభుత్వ ప్రమాదకర మూర్ఖపు వైఖరిని తిప్పికొట్టి కృష్ణా జలాలపై ప్రాజెక్టులపై తెలంగాణకు రావాల్సిన వాటాను, హక్కులను నూటికి నూరుశాతం కాపాడేందుకు ఎంతదాకనైనా పోరాడాల్సిం దేనని బీఆర్ఎస్ అధినేత కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు అన్నారు. మహబూబ్‌నగర్, రంగారెడ్డి, ఖమ్మం, నల్గొండ జిల్లాల ప్రతినిధులతో సమీక్షలో కేసీఆర్ మాట్లాడుతూ తెలంగాణ ఉద్యమంలో సాగునీరు, తాగునీటి హక్కుల కోసం పోరాడడమే కాకుండా 'మా నీళ్లు మాకే' అనే ప్రజా నినాదాన్ని.. స్వయంపాలన ప్రారంభమైన అనతికాలంలోనే నిజం చేసి చూయించిన ఘనత బీఆర్ఎస్ పార్టీ ప్రభుత్వా నిదేనని స్పష్టం చేశారు. కేఆర్ఎంబీ పేరుతో కృష్ణా నదీ ప్రాజెక్టులపై తెలంగాణకున్న హక్కులను కైవసం చేసుకు నేందుకు కేంద్రం వేసే ఎత్తుగడలను ఎప్పటికప్పుడు తిప్పికొడుతూ కేంద్రం ఒత్తిళ్లను తట్టుకుంటూ పదేండ్ల పాటు బీఆర్ఎస్ ప్రభుత్వం తీవ్రంగా కృషి చేసి కాపాడిం దన్నారు. కానీ, కాంగ్రెస్ ప్రభుత్వ అవగాహన రాహిత్యం తో సంతకాలు చేసి తీసుకున్న మిగతాది 2లో

## చెల్లెల్ని రేప్ చేసి హత్య

- కస్‌గంజ్‌లో దారుణ ఘటన
- కాపాడాల్సిన అన్న కాలయముడై..
- మొబైల్‌లో పోర్న్ చూసి సోదరిపై అత్యాచారం హత్య
- ఇంట్లో చెబుతుందన్న భయంతో హత్య చేసినట్లు వెల్లడి
- ఏడాది క్రితమే మరణించిన తండ్రి



**కస్‌గంజ్:** యూపీలో ఓ షాకింగ్ ఘటన జరిగింది. 19 ఏళ్ల కుర్రాడు తన మైనర్ సోదర్ని రేప్ చేసి హత్య చేశాడు. కస్‌గంజ్‌లో ఈ దారుణ ఘటన చోటుచేసుకున్నది. పోలీసుల కథనం ప్రకారం.. సంజూ అనే వ్యక్తి తన మొబైల్ ఫోన్‌లో పోర్న్ వీడియోలు చూసిన తర్వాత తన సోదరిపై అత్యాచారానికి పాల్పడినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 3వ తేదీ రాత్రి ఈ ఘటన జరిగింది. ఇంట్లో చెబుతుందన్న భయంతో సోదర్ని అతను హత్య చేసినట్లు మిగతాది 2లో

## సీఎం సిద్ధరామయ్యతో సహా నలుగురికి జరిమానా



**కర్నాటక :** కర్నాటక ముఖ్యమంత్రి సిద్ధరామయ్య, కేబినెట్ మంత్రులు ఎంబీ పాటిల్, రామలింగారెడ్డితో పాటు కాంగ్రెస్ నేత రణదీప్ సూర్జేవాలాకు ఆ రాష్ట్ర హైకోర్టు రూ.10వేల జరిమానా విధించింది. నలుగురిని ప్రజాప్రతినిధుల కోర్టులో హాజరుపరచాలని ఆదేశించింది. మార్చి 6న సీఎం సిద్ధ రామయ్య, 7న రవాణాశాఖ మంత్రి రామలింగారెడ్డి, 11న కాంగ్రెస్ కర్నాటక ఇన్‌చార్జి రణదీప్ సూర్జేవాలా, 16న పరిశ్రమలశాఖ మంత్రి ఎంబీ పాటిల్ కోర్టులో హాజరుకావాలని చెప్పింది. కాంట్రాక్టర్ సంతోష్ పాటిల్ ఆత్మహత్య కేసులో అప్పటి మంత్రి కేఎస్ ఈశ్వరప్పను అరెస్టు చేయాలని డిమాండ్ చేస్తూ 2022 ఏప్రిల్‌లో నిర్వహించిన కార్యక్రమంలో ప్రస్తుత సీఎం సహా కాంగ్రెస్ నేతలు పాల్గొన్నారు. కాంట్రాక్టర్ సంతోష్ పాటిల్ బెలగావి వాసి కాగా.. ఆయన ఉడిపిలోని హోటల్‌లో ఆత్మహత్యకు పాల్పడ్డారు. అయితే, తాను మిగతాది 2లో

## బాణసంచ ఫ్యాక్టరీలో ఘోర ప్రమాదం

- 11 మంది దుర్మరణం, 65కు పైగా క్షతగాత్రులు



**హర్దా:** మధ్యప్రదేశ్‌లోని హర్దా టౌన్‌లో ఘోర విషాదం చోటుచేసుకుంది. బాణసంచ ఫ్యాక్టరీలో భారీ పేలుడు సంభవించి ఒక్కసారిగా పెద్దఎత్తున మంటలు చెలరేగడంతో 11 మంది దుర్మరణం పాలయ్యారు. మరో 65 మంది వరకూ గాయపడ్డారు. అగ్నిమా పక శకటాలు, సహాయక బృందాలు హుటాహుటిన ఘటనా స్థలికి చేరుకుని సహాయక కార్యక్రమాలు చేపట్టారుయి. మంటలు చుట్టుపక్కల ఉన్న భవనాలకు కూడా విస్తరించడంతో పలువురు పరుగులు తీయగా, మరికొందరు ఫ్యాక్టరీలో చిక్కుకున్నట్టు అనుమానిస్తున్నారు.

**– తక్షణ చర్యలకు సీఎం ఆదేశం**

హర్దా టౌన్‌లో ఘోర విషాదం చోటుచేసుకోవడం ముఖ్యమంత్రి డాక్టర్ మోహన్ యాదవ్ అత్యవసర సమావేశం ఏర్పాటు చేశారు. పరిస్థితిని సమీక్షిం చారు. హెలికాప్టర్ ద్వారా మిగతాది 2లో


## అశ్లీల దృశ్యాలపై అదుపు లేదు

- నీతి మాలిన సంభాషణల్లో జీవితం లేదు
- అసూయ ద్వేషాల మధ్యన జీవితాలు బుగ్గిపాలు
- సగటు ప్రజల జీవితానికి స్థానం లేదు
- సంపన్న వర్గాల జీవనయానాన్ని కథాంశంగా చూపిస్తే ప్రయోజనమేంటి?
- టీవీ ప్రసారాలు సీరియల్లలోని అసంబద్ధ అంశాలు నిషేధించాలి.
- సామాజిక రాజకీయ విశ్లేషకులు : వడ్డేపల్లి మల్లేశం

3లో

## వేగంగా మారుతున్న ఏపీ రాజకీయ సమీకరణాలు

- బీజేపీ పెద్దలను కలవనున్న చంద్రబాబు..!



**తరంగాలు/విజయవాడ:** అసెంబ్లీ ఎన్నికలు దగ్గర పడుతుండటంతో ఏపీ రాజకీయాల్లో పొత్తులపై క్లారిటీ వచ్చే అవకాశాలు కనిపిస్తున్నాయి. ఇప్పటికే పొత్తులు, సీట్లు పంపకంపై టీడీపీ, జనసేన ఓ అవగాహనకు వచ్చినట్టు వార్తలు వినిపిస్తున్నాయి. అయితే తమతో కలిసి వచ్చే అంశంపై బీజేపీ తీసుకునే నిర్ణయం కోసమే చంద్రబాబు, పవన్ కళ్యాణ్ ఎదురుచూస్తున్నారు. పవన్ కళ్యాణ్‌కు ఈ అంశంపై క్లారిటీ ఇచ్చేందుకు ఢిల్లీ నుంచి పిలుపు వస్తుందని ప్రచారం జరిగింది. అయితే ఈ వ్యవహారంలో బీజేపీ ఇంకా ఓ మిగతాది 2లో

# తప్పని సదరం తిప్పలు

- సదరం స్లాట్‌లు తక్కువ... సర్టిఫికెట్ కావాల్సిన వారు ఎక్కువ
- నిమిషాల వ్యవధిలో క్లోజ్
- ప్రభుత్వ కార్యాలయాలు, మీసేవ కేంద్రాల చుట్టూ తిరుగుతున్న దివ్యాంగులు
- స్లాట్స్ సంఖ్య పెంచాలని వేడుకోలు





**తరంగాలు/హైదరాబాద్:** సదరం క్యాంపునకు హాజరు కావాలనుకునే దివ్యాంగులకు నెలల తరబడి తిరిగినా స్లాట్ బుక్ కావడం లేదు. నెల, రెండు నెలలకోసారి అధికారులు స్లాట్స్ విడుదల చేయగానే.. నిమిషాల్లో క్లోజ్ అయిపోతున్నాయి. సదరం క్యాంపునకు హాజరయ్యేందుకు ఎదురు చూసే దివ్యాంగుల సంఖ్య ఎక్కువగా ఉండడం, స్లాట్స్ సంఖ్య తక్కువగా ఉండడంతో తిప్పలు తప్పడం లేదు. దీంతో వారు ఒక నెల బుకింగ్స్ అయిపోతే మరో నెల వరకు ఎదురుచూడాల్సి వస్తోంది. ఇలా సంవత్సరాల తరబడి ఎదురుచూస్తున్న దివ్యాంగులు ఎంతో మంది ఉన్నారు.

**స్లాట్స్ రిలీజైన రోజు మీసేవ కేంద్రాల్లో బారులు**

వైకల్య ధ్రువీకరణ కోసం ఎవరైనా సదరం క్యాంపులకు హాజరు కావాల్సి ఉంటుంది. గతంలో మండల, డివిజన్ కేంద్రాల్లో ఒకేసారి వేలాది మందికి క్యాంపులు పెట్టి నిర్ధారణ పరీక్షలు చేసేవారు. కానీ, ఆ తర్వాత నెలకు 50 నుంచి 100 సాట్ల చొప్పున రిలీజ్ చేస్తున్నారు. ఇందులో కంటి చూపు, ఆర్థో, మానసిక బుద్ధి మాంద్యం, వినికిడి(మూగ, చెవుడు) తదితర దివ్యాంగులను అసెస్ చేస్తున్నారు. డీఆర్డీఏ ముందుగా ప్రకటించిన రోజున నిర్ణీత సమయంలోనే మీసేవ కేంద్రాల వద్దకు వెళ్లి స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుంది. దీంతో అధికారులు ప్రకటించిన రోజు జిల్లాలోని అన్ని మీ సేవ కేంద్రాల వద్ద దివ్యాంగులు, వారి బంధువులు బారులు తీరుతున్నారు. ఆపరేటర్లు స్లాట్ కోసం వివరాలు నమోదు చేయడం ప్రారంభించిన నిమిషాల మిగతాది 2లో

## కోర్టుకు వెళ్లయినా సాధించుకునే వీలు ఉండేది!

- మాట్లాడితే 14ఏళ్ల అంటారు.. ఎందుకు పనికొస్తుంది ఆ అనుభవం
- అనుభవం లేకపోయినా అందరూ ఆశ్చర్యపోయే పాలన అందిస్తున్నాం
- అసెంబ్లీలో సీఎం జగన్ సంచలన వ్యాఖ్యలు



**ఆంధ్రప్రదేశ్ :** ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ప్రత్యేక హోదాపై మరోసారి స్పందించారు. విభజన చట్టంలో కనీసం హోదా అంశాన్ని రాసి ఉంటే బాగుండేది. కోర్టుకు వెళ్లయినా సరే సాధించుకునే వీలు ఉండేది!.. ఇప్పుడు, కేంద్రం ఇస్తే తప్ప మాట్లాడలేని పరిస్థితి నెలకొందని.. అందుకే కేంద్రంలో ఏపార్టీకీ పూర్తి మెజార్టీ రాకూడదని కోరుకుంటున్నామని జగన్ పేర్కొన్నారు. అప్పుడైనా మిగతాది 2లో

# చెల్లెల్ని రేప్ చేసి హత్య

– మొదటి పేజీ తరువాయి

పోలీసులు వెల్లడించారు. కేసును దర్యాప్తు చేస్తున్న సమయంలో ఈ విషయాలు వెల్లడైనట్లు పోలీసులు చెప్పారు. పటియాలీ కొత్వాలి ఇంచార్జ్ ఎస్ఐ గోవింద్ బల్లబ్ శర్మ దర్యాప్తు అంశాలను ప్రకటించారు. తన మేనల్లుడి గురించి అతని మామ ఫిర్యాదు ఇచ్చినట్లు పోలీసులు చెప్పారు. ఫిబ్రవరి 4వ తేదీన ఫిర్యాదు ఇచ్చారు. నిందితుడి కోసం పోలీసులు గాలించారు. సోమవారం సాయంత్రం అతన్ని అదుపులోకి తీసుకున్నారు. నిందితుడు సంజూ తండ్రి ఏడాది క్రితమే మరణించాడు. తల్లి, సోదరితో కలిసి అతను జీవిస్తున్నాడు. అయితే అఘాయిత్యం జరిగిన రోజున తల్లి బంధువల ఇంటికి వెల్లింది. ఇంట్లో ఒంటరిగా ఉన్న ఆ కుర్రాడు తన సోదరిపై అత్యాచారానికి పాల్పడ్డాడు.

## బాణసంచ ఫ్యాక్టరీలో ఘోర ప్రమాదం

– మొదటి పేజీ తరువాయి

పరిస్థితిని అంచనా వేసి తక్షణ సహాయక చర్యలు చేపట్టాలని మంత్రి ఉదయ్ ప్రతాప్ సింగ్, ఐపీఎస్ అజిత్ కేసరి, హెూం గార్డ్ డీజీపీ అరవింద్ కుమార్‌ను ఆదేశించారు. క్షతగాత్రుల తక్షణ చికిత్సకు భోపాల్, ఇండోర్‌లోని మెడికల్ కాలేజీలు, భోపాల్ ఏఐఐఎంఎస్ బర్న్ యూనిట్‌కు అదేశాలిచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.4 లక్షల చొప్పున నష్టపరిహారం ప్రకటించారు. క్షతగాత్రులకు ఉచిత చికిత్స అందించనున్నారు. కాగా, హార్దా జిల్లా ఆసుపత్రిలో 65 మంది వరకూ చేరారని, మరో 10 మందిని వేరే ఆసుపత్రికి పంపామని ఆసుపత్రి వర్గాలు తెలిపాయి.

## తప్పని సదరం తిప్పలు

– మొదటి పేజీ తరువాయి

వ్యవధిలోనే మొత్తం స్లాట్స్ క్లోజ్ అయినట్లు చూపుతుండడంతో చాలా మంది నిరాశతో వెనుదిరుగుతున్నారు. ఒక్కో సెంటర్లో ఒకటి, రెండు స్లాట్లు మాత్రమే నమోదవుతున్నట్లు ఆపరేటర్లు వెల్లడిస్తున్నారు.

**– రెన్యువల్ కోసం ఇబ్బందులు..**

వైకల్యాన్ని నిర్ధారించే క్రమంలోనే కొందరికి పర్మినెంట్ సదరం సర్టిఫికెట్, మరికొందరికి రెండు, మూడేండ్ల కాలపరిమితితో సర్టిఫికెట్లు జారీ చేస్తుంటారు. ఇలా రెండు, మూడేండ్ల కాలపరిమితితో సర్టిఫికెట్లు పొందినవాళ్లు..గడువు తీరిన తర్వాత మళ్లీ స్లాట్ బుక్ చేసుకుని వైకల్య నిర్ధారణ పరీక్షలు చేయించుకోవాల్సి ఉంటుంది. లేదంటే వారికి ఆసరా పింఛన్ ఆగిపోతుంది. ఇలాంటి వారు స్లాట్స్ బుక్ కాక నెలల తరబడి మీసేవ కేంద్రాల చుట్టూ తిరగాల్సి వస్తోంది. దీంతో నెలలు, సంవత్సరాల తరబడి పింఛన్ కోల్పోతున్న బాధితులు వందల్లో ఉన్నారు. ఇది తమ హక్కులను హరించడమేనని, ఇప్పటికైనా స్లాట్స్ సంఖ్య పెంచి అర్హులందరికీ సదరం సర్టిఫికెట్లు జారీ చేయాలని దివ్యాంగులు కోరుతున్నారు. దివ్యాంగులకు స్లాట్ వ్యవస్థ ద్వారా తీవ్ర అన్యాయం జరుగుతోందని, స్లాట్ దొరకకపోవడం వల్ల సదరం సర్టిఫికెట్ పొందలేకపోవడం, పింఛన్ రాకపోవడం దివ్యాంగుల హక్కుల చట్టం ఉల్లంఘన కిందకే వస్తుందని పలువురు నాయకులు మండిపడుతున్నారు.

## కోర్టుకు వెళ్లయినా సాధించుకునే వీలు ఉండేది!

– మొదటి పేజీ తరువాయి

సరే నిధులు, హెూదాపై మాట్లాడే వీలుంటుందన్నారు. ఈ సందర్భంగా చంద్రబాబు పాలన అనుభవంపై సీఎం జగన్ సెటైర్లు వేశారు. మాట్లాడితే 14ఏళ్లు అంటారు, ఎందుకు పనికొస్తుంది ఆ అనుభవం.. అనుభవం లేకపోయినా అందరూ ఆశ్చర్యపోయే పాలన అందిస్తున్నామంటూ జగన్ పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక అభివృద్ధికి పెద్దనగరాలు అవసరమని సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రతి రాష్ట్రానికి చెన్నై, బెంగళూరు హైదరాబాద్ లాంటి మహానగరం ఉండాలన్నారు. ప్రతి రాష్ట్రానికి ఎకనామిక్ పవర్ హౌస్ ఉండాలి.. హైదరాబాద్‌ను కోల్పోవడం వల్ల చాలా నష్టపోయామని.. అందుకే విశాఖపై ఎక్కువ ఫోకస్ చేస్తున్నామన్నారు. విశాఖపై అసెంబ్లీలో మరోసారి మాట్లాడిన జగన్.. హైదరాబాద్, చెన్నై, బెంగళూరులాంటి నగరాలు ఉంటేనే ఆదాయం వస్తుందన్నారు. హైదరాబాద్ కోల్పోవడం వల్ల మనం ఏటా 13వేల కోట్లు నష్టపోతున్నాం.. అందుకే విశాఖ కావాలని పట్టుబడుతున్నానని జగన్ పేర్కొన్నారు. రాష్ట్ర విభజనతో ఏపీ తలసరి ఆదాయం తగ్గిపోయిందని సీఎం జగన్ పేర్కొన్నారు. తెలంగాణతో పోల్చితే ఏపీకి తక్కువ ఆదాయం వస్తుందని.. రాష్ట్రాన్ని అడ్డగోలుగా విభజించారన్నారు. ప్రత్యేక హెూదాను చట్టంలో చేర్చలేదని సీఎం జగన్ పేర్కొన్నారు. ప్రత్యేక హెూదా ఎండమావిగా కనిపిస్తోందని తెలిపారు.

## కాంగ్రెస్ సర్కారు మూర్ఖపు వైఖరిని తిప్పికొట్టాలి

– మొదటి పేజీ తరువాయి

నిర్ణయంతో భవిష్యత్తులో ప్రాజెక్టుల కట్టలమీదికి కూడా పోలేని పరిస్థితి దాపురిం చిందని ఆవేదన వ్యక్తం చేశారు. దీన్ని ప్రజా మద్దతుతో తిప్పికొడుతామన్నారు. హైదరాబాద్ రంగారెడ్డి, నల్గొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ ఉమ్మడి జిల్లాల ప్రజలకు సాగునీరు తాగునీరు అందక తిరిగి కరువుకోరల్లో చిక్కుకునే ప్రమాదం పొంచివున్నదని ఆందోళన వ్యక్తం చేశారు. సమావేశంలో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, మాజీ మంత్రులు హరీశ్ రావు, జీ జగదీశ్ రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, నిరంజన్ రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, తలసాని శ్రీనివాస్ యాదవ్, మల్లారెడ్డి, పువ్వాడ, సత్యవతి రాథోడ్‌తో పాటు ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు, జడ్పీ చైర్మన్లు, మున్సిపల్ చైర్మన్లు, రైతుబంధు సమితి జిల్లా అధ్యక్షులు పాల్గొన్నారు.

## సీఎం సిద్ధరామయ్యతో సహా నలుగురికి జరిమానా

– మొదటి పేజీ తరువాయి

చేసిన పనులకు ఈశ్వరప్ప కమిషన్ డిమాండ్ చేశారని ఆరోపించారు. అయితే, ఈశ్వరప్ప ఆరోపణలను తోసిపుచ్చడంతో పాటు ఆయనపై పరువు నష్టం కేసు నమోదు చేశారు. కాంట్రాక్టర్ ఆత్మహత్య కేసులో మంత్రి రాజీనామా చేయాలని అప్పటి కాంగ్రెస్ నేతలు నిరసన చేపట్టారు. అప్పటి సీఎం బసవరాజ్ బొమ్మై నివాసం వైపు వెళ్లేందుకు ప్రయత్నించా డీకే శివకుమార్‌తో సహా కాంగ్రెస్ నాయకులను పోలీసులు అరెస్టు చేశారు.

# టీలో ఎలుకలమందు కలిపి భర్త, పిల్లలతో కలిసి తాగిన భార్య

- **ఇద్దరు పిల్లలు మృతి, ఆస్పత్రిలో దంపతులు**
- **పుట్టింటికి వద్దన్నాడని భర్తకు టీలో ఎలుకలమందు కలిపిన భార్య**



**తరంగాలు/పల్నాడు:** పల్నాడు జిల్లా మాచర్ల మండలం నారాయణపురం తండాకు చెందిన రవినాయక్ అనే వ్యక్తి హైదరాబాద్‌లో ఆటో నడుపుతూ జీవనం సాగిస్తున్నాడు. రవి నాయక్‌కు సొంత అక్క కూతురు వసంతతోనే 12 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ముగ్గురు పిల్లలు కూడా. హైదరాబాద్‌లో ఆటో నడిపే రవినాయక్ వారం, పదిరోజులకు ఓసారి ఇంటికి వచ్చి పెళ్లాం పిల్లలతో గడిపేవాడు. అయితే పెళ్లి సమయంలో రవినాయక్‌కు రెండు ఎకరాల పొలం కట్నంగా ఇచ్చారు. అప్పులు ఎక్కువ కావటంతో అందులో ఒక ఎకరం అమ్మేయాలని నిర్ణయించుకున్నాడు రవినాయక్. ఈ విషయమై ఆదివారం ఉదయం తన అక్క దగ్గరకు వెళ్లి పొలం అమ్మాలనుకున్న సంగతిని చెప్పాడు.. అయితే అందుకు ఆవిడ అంగీకరించలేదు. ఇద్దరి మధ్య గొడవ జరిగింది. ఇంటికి వచ్చిన రవినాయక్ భార్యకు ఈ విషయం చెబితే.. వసంత కూడా తన అమ్మకు మద్దతుగా మాట్లాడింది. పొలం అమ్మేందుకు అంగీకరించలేదు. ఆ తర్వాత వారిద్దరి మధ్య గొడవ జరిగింది.ఈ నేపథ్యంలో ఆదివారం సాయంత్రం వసంత పుట్టింటికి వెళ్లేందుకు బయల్దేరింది. అయితే ఆ ప్రయత్నాన్ని రవినాయక్ అడ్డుకున్నాడు. దీంతో ఇద్దరి మధ్య మరోసారి గొడవ జరిగింది. ఈ కోపంలోనే టీలో ఎలుకల మందు కలిపి పిల్లలు, భర్తకు ఇచ్చిన వసంత తాను కూడా తాగింది. అయితే టీ రుచి తేడారావటం, వాసన కూడా వస్తుండటంతో రవినాయక్ కొద్దిగా తాగి ఆ తర్వాత పక్కనపెట్టేశాడు. కానీ ఆలోపే పిల్లలు మాత్రం పూర్తిగా తాగేశారు. ఆ తర్వాత వాంతులతో పాటు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు వీరిని సమీపంలోని ఆస్పత్రికి తరలించగా.. చిన్నారుల్లో ఇద్దరు చికిత్స పొందుతూ ప్రాణాలు విడిచారు. ప్రస్తుతం మరో చిన్నారితో పాటు భార్యాభర్తలు ఇద్దరూ ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. ఎలుకల మందు కలిపిన టీని రవినాయక్ కొద్దిగా మాత్రమే తీసుకున్న నేపథ్యంలో రవినాయక్ ఆరోగ్యం ప్రస్తుతం మెరుగ్గా ఉన్నట్లు వైద్యులు చెబుతున్నారు.

# కొడుకును కొట్టిన ఫ్రెండును చంపేసిన తల్లి

- **కత్తితో పొడవడంతో చికిత్స పొందుతూ యువకుడు మృతి**



**తరంగాలు/నిజామాబాద్:** తన కుమారుడి గురించి తరచూ చులకనగా మాట్లాడుతూ గొడవ పెట్టుకుంటున్నాడని ఆగ్రహంతో కత్తితో పొడిచి చంపేసింది. వివరాల్లోకి వెళితే.. నిజామాబాద్ పట్టణం గౌతమ్ నగర్కు చెందిన పవన్, చిన్ను, చందు ముగ్గురు స్నేహితులు. స్థానికంగా పెయిటింగ్ పనులు చేసుకుంటూ వీరు ఉపాధి పొందుతున్నారు. అయితే ఒక్కొక్కరు వారానికి ఒకసారి మందు పార్టీ ఇవ్వాలనే ఓ కండీషన్ పెట్టుకున్నారు. గత ఆరు నెలలుగా ఈ షరతును కొనసాగిస్తున్నారు. ఆదివారం పవన్ వంతు రాగా.. పార్టీ ఇవ్వాలని చిన్ను, చందు వెళ్లి అడిగారు. తన దగ్గర డబ్బులు లేవని ఇప్పుడు పార్టీ ఇవ్వనని పవన్ వారితో చెప్పాడు. దీంతో ముగ్గురి మధ్య గొడవ జరగ్గా.. పవన్, చిన్నుకు గాయాలయ్యాయి.గాయాలతో ఇంటికొచ్చిన కొడుకు చిన్నును చూసిన అతడి తల్లి రేణుక ఏం జరిగిందని అడిగింది. దీంతో చిన్ను జరిగిన విషయాన్ని మొత్తం తల్లికి చెప్పాడు. కోపంతో ఊగిపోయిన రేణుక తన కుమారుడిని వెంట బెట్టుకొని పవన్ వద్దకు వెళ్లింది. అంతకు ముందు కూడా చాలాసార్లు తన కుమారుడిని కొట్టావని కుటుంబీకుల ముందు ప్రశ్నిస్తూనే వెంట తెచ్చుకున్న కత్తితో పవన్ కడుపులో పొడిచింది. ఈ దాడిలో తీవ్ర రక్తస్రావం అయి పవన్ అక్కడికక్కడే కుప్ప కూలిపోయాడు. దీంతో కుటుంబ సభ్యులు పవన్ను వెంటనే జీజీహెచ్ హాస్పిటల్కు తరలించారు. అక్కడ చికిత్స పొందు తూ ఆదివారం రాత్రి అతడు మృతి చెందాడు. మృతుడి కుటుంబసభ్యుల ఫిర్యాదు మేరకు చిన్నూ, అతడి తల్లిపై పోలీసులు కేసు నమోదు చేశారు. అయితే ఘటన జరిగిన వెంటనే పరారు కాగా వారి కోసం పోలీసులు గాలిస్తున్నారు.

# పిల్ల చేష్టలు చేస్తున్న సీఎం రేవంత్ రెడ్డి

- **కొత్త సీఎంకు అవగాహన లేదు**
- **ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగిస్తే జరిగే నష్టం వాళ్లకు తెల్వదు**
- **బీఆర్ఎస్ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్**



**తరంగాలు/హైదరాబాద్ :** తెలంగాణ ప్రాజెక్టుల మీద ప్రస్తుత సీఎం రేవంత్ రెడ్డికి అవగాహన లేదని... ప్రాజెక్టులు కేఆర్ఎంబీకి అప్పగిస్తే జరిగే నష్టం కూడా వాళ్లకు తెల్వదని బీఆర్ఎస్ చీఫ్, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్ అన్నారు. అసెంబ్లీ ఎన్నికల తర్వాత తొలిసారి తెలంగాణ భవన్‌కు చేరుకున్న కేసీఆర్.. కృష్ణా పరివాహక ప్రాంతం నేతలతో సమావేశమయ్యారు. ప్రాజెక్టులు అప్పగిస్తే తెలంగాణకు జరిగే నష్టాన్ని నేతలకు బీఆర్ఎస్ అధినేత వివరించారు. ప్రాజెక్టులపై కేంద్రం పెత్తనం వస్తే అడుక్కోవాల్సి వస్తుందన్నారు. బీఆర్ఎస్ ప్రభుత్వం ఉండగా ప్రాజెక్టుల అప్పగింతకు ఒప్పుకోలేదని.. సీఎం రేవంత్ రెడ్డి పిల్ల చేష్టలు చేస్తున్నారని విమర్శించారు. ఆయనకు పాలన ఎలా చేయాలో అర్థం కావడం లేదన్నారు. ఇప్పుడు అవగాహన లేక ప్రాజెక్టులను అప్పగించడానికి ఒప్పుకున్నారని... దీని వల్ల జరిగే నష్టాన్ని ప్రజలకు చెప్పాలని బీఆర్ఎస్ అధినేత డిమాండ్ చేశారు.

రైతులకు నష్టం చేసేలా కృష్ణా ప్రాజెక్టులను కేఆర్ఎంబీకి అప్పగిస్తూ రాష్ట్ర ప్రభుత్వం అనుసరిస్తున్న వైఖరిని ఖండిస్తున్నామన్నారు. కృష్ణా నదీ జలాలపై తెలంగాణ హక్కులను కాపాడుకోవడం కోసం ఎంతకాడికైనా పోరాడుతామని స్పష్టం చేశారు. మరో ప్రజా ఉద్యమాన్ని నిర్మించి హక్కులకు భంగం వాటిల్లకుండా చూసుకునే బాధ్యత తెలంగాణ ఉద్యమకారులదే అని అన్నారు. ప్రభుత్వం అనాలోచిత వైఖరి కృష్ణా బేసిన్‌లోని దక్షిణ తెలంగాణ రైతాంగ సాగునీటి హక్కులకు గొడ్డలి పెట్టులా మారింద న్నారు. “కేఆర్ఎంబీకి సాగర్, శ్రీశైలం సహా కృష్ణా నదిమీద ప్రాజెక్టులను అప్పజెప్పి కేంద్రం చేతికి మన జుట్టు అందించింది” అని మండిపడ్డారు. కాంగ్రెస్ ప్రభుత్వ తెలంగా ణ వ్యవసాయ రైతాంగ వ్యతిరేక నిర్ణయాలను తీవ్రంగా ఖండి స్తున్నామన్నారు. ప్రజా క్షేత్రంలో రాష్ట్ర ప్రభుత్వ ప్రమాదకర ధోరణిని ఎండగడుతామని కేసీఆర్ స్పష్టం చేశారు.

## వేగంగా మారుతున్న ఏపీ రాజకీయ సమీకరణాలు

– మొదటి పేజీ తరువాయి

క్లారిటీకి రాకపోవడంతో.. ఆయన ఢిల్లీ పర్యటన ఖరారు కాలేదు. అయితే ఏపీలో పొత్తుల అంశంపై ఈ రాత్రికి ఓ స్పష్టత వచ్చే అవకాశం ఉందని తెలుస్తోంది. దీనిపై ఏదో ఒక నిర్ణయం తీసుకోవాల్సి ఉండటంతో.. ఆ దిశగా బీజేపీ నాయకత్వం కసరత్తు చేస్తున్నట్టు సమాచారం. ఏపీలో పొత్తులపై బీజేపీ తుది నిర్ణయం తీసుకునే సమయం వచ్చిందని రాజకీయవర్గాల్లో చర్చ జరుగుతోంది. ఇక ఇప్పటికే టీడీపీ, జనసేన పొత్తులు, సీట్ల పంపకంపై దాదాపుగా ఓ అవగాహనకు వచ్చాయి. అయితే బీజేపీ తమతో కలిసి వస్తే సీట్ల పంపకం ప్రక్రియను వీలైనంత తొందరగా పూర్తి చేయాలని భావిస్తున్నాయి. ఈ క్రమంలోనే బీజేపీ జాతీయ నాయకత్వం తీసుకునే నిర్ణయం కోసం ఇరు పార్టీలు ఎదురుచూస్తున్నాయి.

## రెండో రోజు కొనసాగుతున్న ఏపీ అసెంబ్లీ సమావేశాలు




**తరంగాలు/ అమరావతి :** ఆంధ్రప్రదేశ్ అసెంబ్లీ సమావేశాలు రెండోరోజుకు చేరుకున్నాయి. తొలిరోజు గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉభయసభలను ఉద్దేశించి ప్రసంగించగా.. ఆయన ప్రసంగంపై ఇవాళ ధన్యవాద తీర్మానం కోసం సభ్యులు చర్చిస్తారు. ఈ సమావేశాల్లో రెండు బిల్లులను ప్రవేశపెట్టాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్స్ వెల్ఫేర్ ఫండ్ సవరణ బిల్లు ఒకటి, ఆంధ్రప్రదేశ్ అడ్వకేట్స్ క్లర్క్స్ వెల్ఫేర్ ఫండ్ సవరణ బిల్లులను సభలో ప్రవేశపెట్టి ఆమోదం తెలపనుంది ప్రభుత్వం. నాలుగు రోజులు పాటు జరిగే సమావేశాల్లో భాగంగా రేపు మధ్యంతర బడ్జెట్ ప్రవేశపెడుతారు ఆర్థిక మంత్రి బుగ్గన రాజేంద్రప్రసాద్. అనంతరం బడ్జెట్‌పై సభ్యులు చర్చిస్తారు. ఎన్నికలకు ముందు జరుగుతున్న సమావేశాలు కావడంతో వచ్చే ఆర్థిక సంవత్సరంలో మొదటి మూడు నెలల కోసం బడ్జెట్‌కు అసెంబ్లీ ఆమోదం తెలపనుంది. సుమారు 60 వేల కోట్లతో ఓట్ ఆన్ అకౌంట్ బడ్జెట్ ఉంటుందని అధికారులు చెబుతున్నారు.

## 8 నుంచి పురందరదాసుల ఆరాధనా మహెూత్సవాలు

- **తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ**



**తిరుమల :** కర్ణాటక సంగీత పితామహులు పురందరదాసుల ఆరాధనా మహెూత్సవాలు ఫిబ్రవరి 8 నుంచి 10వ తేదీ వరకు తిరుమల ఆస్థాన మండపంలో ఘనంగా నిర్వహిస్తున్నట్లు టీటీడీ అధికారులు వివరించారు. ఈ సందర్భంగా టీటీడీ దాససాహిత్యప్రాజెక్టు ఆధ్వర్యంలో ఈనెల 7న తిరుమలలోని కల్యాణవేదికలో రాత్రి 7 గంటలకు యువ కళాకారులతో శ్రీ వేంకటేశ్వర నవరత్న మాలిక’ గోష్టిగానం నిర్వహించనున్నమని తెలిపారు. పురందరదాసు 4.75 లక్షలకు పైగా సంకీర్తనలు రచించారని, వీటిలో ప్రధానంగా తొమ్మిది సంకీర్తనలను దాదాపు 300 మంది సుప్రసిద్ధ కళాకారులు గోష్టిగానం చేస్తారని వెల్లడించారు.


**– తిరుమలలో కొనసాగుతున్న భక్తుల రద్దీ**

తిరుమలలోని వేంకటేశ్వరస్వామిని దర్శించుకునేందుకు టోకెన్లు లేని భక్తులకు 8 గంటల్లో సర్వదర్శనం కలుగుతుందని ఆలయ అధికారులు తెలిపారు. ప్రస్తుతం 4 కంపార్టుమెంట్లలో వేచియున్నారని పేర్కొన్నారు. నిన్న స్వామివారిని 64,512 మంది భక్తులు దర్శించుకోగా 23,491 మంది తలనీలాలు సమర్పించుకున్నారు. భక్తులు సమర్పించుకున్న కానుకల ద్వారా హుండీ ఆదాయం రూ. 3.69 కోట్లు వచ్చిందన్నారు.

# అశ్లీల దృశ్యాలపై అదుపు లేదు

- నీతి మాలిన సంభాషణల్లో జీవితం లేదు
- అసూయ ద్వేషాల మధ్యన జీవితాలు బుగ్గిపాలు
- సగటు ప్రజల జీవితానికి స్థానం లేదు
- సంపన్న వర్గాల జీవనయానాన్ని కథాంశంగా చూపిస్తే ప్రయోజనమేంటి?
- టీవీ ప్రసారాలు సీరియల్ల లోని అసంబద్ధ అంశాలు నిషేధించాలి
- సామాజిక రాజకీయ విశ్లేషకులు : వడ్డేపల్లి మల్లేశం

డెస్క్ : ప్రజా జీవితానికి సంబంధం లేని చర్చ, సీరియల్, సినిమా, నిర్ణయం, ఊహ నిష్ప్రయోజనమైనవి. సమకాలీన సమాజంలోని తప్పటడుగులను ఎత్తి చూపే ప్రయత్నం చేస్తూ అవి డామినేట్ చేయకుండా నివారించగలిగే మార్గాలను వెతికి మెజారిటీ ప్రయోజనాన్ని అందించగలిగే ఆలోచన సర్వత్ర ఉండాలి .అది సినిమా సీరియల్ సామాజిక మాధ్యమాలలో వెలువడే ప్రసారం ఏదైనా కావచ్చు. కానీ టీవీ ప్రసారాలలో అనుక్షణం కనిపిస్తున్న సీరియల్ ప్రజా జీవితాన్ని పక్కనపెట్టి, సమకాలీన జీవిత సమస్యలను స్పృశించకుండా, సామాన్య ప్రజా జీవితాన్ని తీసుకోకుండా, సంపన్న వర్గాలకు సంబంధించిన జీవితాలనే ప్రధానం చేసుకొని, ఊహా జగత్తులో ఊరేగే సామాజిక ప్రయోజనం ఇసుమంతైనా లేని కథ అంశాలు సంభాషణలు సన్నివేశాలు ప్రయోజనం కంటే ఈ వ్యవస్థకు కీడే ఎక్కువగా చేస్తున్నాయని అందరం గుర్తించాలి. నిర్మాతలు, దర్శకులు, ఆర్థికంగా పెట్టుబడి పెట్టి లక్ష్యాన్ని నిర్ధారించుకునే యాజమాన్యం తో పాటు అందులో నటించే కళాకారులు కూడా డబ్బుల కోసం కాకుండా సామాజిక స్పృహ ఉన్న వాళ్లనే ఎంపిక



చేసుకోవడం చాలా అవసరం. ఈ వ్యవస్థ మారాలి మరింత మెరుగైన సమాజాన్ని ఆవిష్కరించుకోవాలి అనే ఆలోచన నటీనట వర్గంతో పాటు దర్శకులు నిర్మాతలకు లేకుంటే ఉత్తమ సీరియల్ ను విడుదల చేయలేము, దానివల్ల ప్రయోజనాలను పొందలేము. కేవలం పెట్టుబడిదారుల ప్రయోజనం కోసం పదిమంది పోషణ కోసం మాత్రమే అని చెప్పుకోక తప్పదు. ముఖ్యంగా తెలుగు సీరియల్ లో కొనసాగుతున్నటువంటి ఈ వింత ధోరణి, వికృత పోకడను, సామాజిక స్పృహ లేని చైతన్య రాహిత్యాన్ని ముందుగా కట్టడి చేయాల్సిన అవసరం. ఉంది. వ్యాపార ధోరణితో గనుక సీరియల్ లను ఇతర ప్రసారాలను నిర్మించినట్లయితే అక్కడ మొక్కుబడి ఆర్థిక ప్రయోజనాలే తప్ప సామాజిక ప్రయోజనాలు చేకూరవనే స్పృహ ఈ వ్యవస్థతో సంబంధం ఉన్నటువంటి అధికారులు, ప్రభుత్వం, చైతన్యము కలిగినటువంటి ప్రజాస్వామిక వాదులకు ఉండాల్సిన అవసరం ఉన్నది. అనేక రకాల సాంప్రదాయ వ్యక్తీకరణలు , మూస విధానం కారణంగా ఇప్పటికే సమాజం అనేక రకాలుగా నష్టపోతుంటే టీవీ ప్రసారాల ద్వారా మెరుగైనటువంటి



వ్యవస్థను ఆవిష్కరించుకునే అవకాశం ఎంతో కొంత ఉన్న పరిస్థితులలో దానిని కూడా పక్కన పెట్టి పెట్టుబడిదారీ వర్గం చేతిలో కొనసాగుతూ ఉంటే ప్రభుత్వం చూస్తూ మౌనంగా ఉంటే ఇక సామాజిక అసమానతలు అంతరాలు వివక్షత తొలగించడానికి ఆస్కారం ఎక్కడిది?.

ప్రసార మాధ్యమాలలో ప్రధాన పాత్ర పోషిస్తున్నటువంటి టీవీ కార్యక్రమాలు ఎంత బలవంతమైనటువంటి ఆయుధాలుగా నిలబడితే అంత వ్యవస్థకు తోడ్పడుతూ వెన్నుదన్నుగా ఉండే అవకాశం ఉంటుంది. అదే సమయంలో అసాంఘిక భావజాలాన్ని, సంఘ వ్యతిరేక శక్తులను అడ్డుకోవడానికి కూడా ఆస్కారం ఉంటుంది. ఈ రకమైనటువంటి ప్రయోజనాన్ని ముఖ్యంగా టీవీ ప్రసారాలు సమాజానికి అందించవలసిన అవసరం ఉంది. కానీ అవి కేవలం ప్రైవేటు వ్యక్తుల ఇంటి ఆస్తిగా భావించబడుతూ ప్రభుత్వం యొక్క నియంత్రణ లేని కారణంగా ప్రజల సామాజిక జీవితానికి భిన్నమైనటువంటి భావజాలాన్ని మనుషుల మెదల్ల లో నింపుతూ శ్రమ జీవితానికి దూరంగా నైతిక ఆదర్శ విలువలను తుంగలోతొక్కే కుట్ర కొనసాగుతున్న విషయాన్ని మనం తప్పకుండా గమనించాలి .

**– టీవీ ప్రసారాలలోని కొన్ని అసంబద్ధ విషయాలు:–**


సెల్ఫోన్ వ్యవస్థ ఏ రకంగా ప్రజా జీవితాన్ని డామినేట్ చేస్తున్నదో అంతకు మించిన స్థాయిలో ఈనాడు ప్రజాసమూహం టీవీ ప్రసారాలకు ఆకర్షితులై మంచి చెడు విచక్షణను ఆలోచించకుండా మొక్కుబడిగా నిరంతరము అతుక్కుపోయిన సందర్భాలను మనం గమనిస్తే దానివల్ల వనగూరుతున్నటువంటి నష్టాలు కూడా తక్కువేమీ కావు. ప్రస్తావించడానికి ఇబ్బంది ఉన్నా అనివార్యమైన పరిస్థితులలో సామాజిక మార్పును ప్రయోజనాన్ని కోరి ఆ సందర్భాలు విషయాలను ఎత్తి చూపక తప్పడం లేదు. ఇటీవలి కాలంలో సీరియల్లో బాగా గమనిస్తున్నటువంటి అంశం ఒకే సన్నివేశానికి సంబంధించిన కథను దీర్ఘకాలం చూపించే జడత్వ పద్ధతి కొనసాగుతూ ఉంటే పెళ్లయిన భార్యాభర్తల మధ్యన శోభనానికి సంబంధించి కుటుంబ సభ్యులందరూ చర్చించుకోవడం, సంవత్సరం తరబడిగా భార్యాభర్తలను శోభనానికి దూరంగా ఉంచిన విషయాన్ని పదేపదే ప్రస్తావించడం, ముహూర్తం లేదు కనుక వారిని దూరంగా ఒంటరిగా జీవించే లాగా ఒత్తిడి చేయడం , విపరీతమైన జాడ్యంతో అసంబద్ధమైన పద్ధతిలో అనాగరికమైన విషయాలను పదే పదే ఎత్తిచూపి పిల్లల నుండి వృద్ధుల వరకు కూడా అసహ్యించుకునే స్థాయిలో కథను నడిపించడం కొందరిని బాధిస్తున్న విషయం. ఇక చూస్తున్నటువంటి జనం ప్రయోజనం, ప్రభావం వంటి అంశాలని ఎక్కడ ఆలోచించకుండా టైం పాస్ కోసం లేదా మొక్కుబడిగా చూడాలి గనుక అనే పద్ధతిలోనే చూస్తున్నారు కానీ అందులోని తప్పొప్పులను పరిశీలించే ఓపిక సామర్థ్యం చొరవ చూపకపోవడం చాలా విచారకరం. తెలియకుండానే చాప కింద నీరు ప్రవేశించినట్లు మనుషుల మెదల్ల లోకి మనిషిని బలహీనునిగా చేసే బలహీనతలను చొప్పించే ప్రయత్నం నిరంతరం కొనసాగుతూనే ఉన్నది.

స్త్రీ పాత్రల సంఖ్య భారీగా పెంచి ఒకరిపై ఒకరు ఆడిపోసుకోవడం, అసూయ పడడం ,ఆధిపత్యాలు



చలాయించడం వంటి సన్నివేశాలను కల్పించి ప్రేమానురాగాలతో జీవించగలిగే సజీవ మానవ సంబంధాలకు గండి కొడుతున్న విషయాన్ని కూడా మనం గమనించాలి. చెప్పడం వినడం కంటే ప్రత్యక్షంగా చూసే అవకాశం వల్ల వెను వెంటనే ప్రభావం కలిగే అవకాశం ఉన్న "మద్యం తాగకూడదు ప్రమాదకరం అనారోగ్యానికి హేతువు" అని ఒక వైపు ప్రకటన వస్తు ఉంటే మద్యం తాగే సన్నివేశాన్ని చూపించడం అత్యంత విచారకరం ఆందోళనకరం కూడా. సహజంగా సమాజానికి భిన్నమైనటువంటి అసాంఘిక చర్యలు దృశ్యాలను ప్రస్తావించకుండా ఉండాల్సినది పోయి క్లబ్బులు, పబ్బులు, ఈవెంట్లు, డాన్సులు, అర్ధనగ్న దృశ్యాలు, అసందర్భ ప్రలాపాలు, ద్వంద్వార్థాలతో విలువలను దిగజార్చే ప్రకటనలు సంభాషణలు హావభావాలు నటన సీరియల్ నిండా దర్శనమిస్తున్న విషయం అందరికీ తెలిసినా ఎందుకు స్పందించడం లేదు? ముఖ్యంగా మహిళలు మహిళా సంఘాలు ఎందుకు ప్రశ్నించడం లేదు ?ఇప్పటికి అంత చిక్కనీ సమస్య..

స్త్రీని అంగడి బొమ్మగా, ఆట సరుకుగా, మార్కెట్ వస్తువుగా సమాజంలో ఒకవైపు వాడుకుంటూనే సీరియల్ లోను వ్యాపార ప్రకటనల్లోనూ స్త్రీలను అత్యంత హీనంగా



చూపించడాన్ని మనం గమనించవచ్చు . ఢీ,శ్రీదేవి డ్రామా కంపెనీ , జబర్దస్త్ వంటి అనేక సీరియల్ ప్రసారాలలో పాల్గొనే వాళ్లతో పాటు న్యాయ నిర్ణేతలుగా పనిచేసే మహిళలు ముఖ్యంగా అర్ధనగ్న శృంగార ప్రదర్శనతో పా ల్గొనడం ,వ్యాఖ్యానించడం , ఆట మాట నటన, చిరునవ్వు, విశ్లేషించడం చూస్తుంటే సమాజమే సిగ్గుపడుతున్నది తప్ప నిర్వాహకులు గాని ఏనాడైనా ప్రభుత్వం కానీ ఆలోచించిన దాఖలా లేదు అనేది నగ్నసత్యం. "కథలో సామాన్యుల జీవితం లేదు, సమాజం ఎదుర్కొంటున్నటువంటి అసమానతలు అంతరాలు దోపిడీ, పీడన వంచన వివక్షత భూ సమస్యలు మానవ సంబంధాలు విచ్ఛిన్నమవుతున్న దుర్భర పరిస్థితులు ఎక్కడ మనకు కనిపించవు, ఈ సందర్భాలను కథాంశాలుగా ఎంపిక చేస్తే కదా ఆ సమస్యలకు పరిష్కారం దొరికేది! అంటే సమస్యలకు పరిష్కారాలను చూపే బదులు లేని సమస్యలను సృష్టించడం ద్వారా కొత్త ఆసక్తిని కల్పించే ప్రయత్నం చేయడం నేటి టీవీ దుర్లక్ష్యమై కూర్చున్నప్పుడు అవి ఏ వర్గ ప్రయోజనం కోసం పని చేస్తాయో ఆలోచించుకోవాల్సిన అవసరం ముఖ్యంగా సమాజంలోని భిన్న వర్గాలపై ఉన్నది . అదే సందర్భంలో ప్రభుత్వం తన నియంత్రణలో ఆమోదించినటువంటి బహుళ ప్రయోజన మాధ్యమమైన టీవీ ప్రసారాల ద్వారా సమాజానికి ప్రయోజనం కలగనప్పుడు సమీక్ష చేసుకోవాలి కదా! ఆ సోయి లేకుండా ప్రభుత్వాలు ఉంటే ఎలా ?గతంలో తెలంగాణ రాష్ట్రం ఆవిర్భవించక ముందు ఉద్యమ కాలంలో భాష, భావం, ప్రయోజనం ,సామాజిక చింతన, సామాజిక ప్రయోజనాలు దోపిడీ చేయబడుతున్నాయి ప్రజా జీవితంతో సంబంధం ఉన్నటువంటి ప్రజల భాషలో వచ్చే టీవీ ప్రసారాలు సినిమాలను సాధించుకోవాలని గొప్పగా చెప్పుకున్న అనంతరం తెలంగాణ రాష్ట్రం ఏర్పడి పదేళ్లు అయినప్పటికీ కూడా ఇసుమంతా మార్పు జరగలేదంటే ఇది రాష్ట్రం ఆవిర్భవించడంతో పరిష్కారమజే సమస్య కాదు... ఆంధ్రప్రదేశ్ తెలంగాణ వంటి తెలుగు రాష్ట్రాలకు సంబంధించిన ప్రధాన సమస్యగా దీన్ని చూడాల్సిన టువంటి అవసరం ఉంటుంది. పౌర సమాజం ప్రభుత్వాలు మేధావులు అధికారులు ఉమ్మడిగా కృషి చేసి ప్రత్యేక కమిటీని ఏర్పాటు చేసి సమాజాన్ని ప్రభావితం చేసే బలమైన సాధనమైన టువంటి టీవీ ప్రసారాల రూపకల్పనను నిర్దేశించుకోవాల్సిన అవసరం ఉంది. మేలు చేయకపోయినా కీడు చేయకూడదు అని జనంలో ఒక నానుడి ఉన్నది అలాగే ఈ వ్యవస్థకు మేలు చేయకపోయినా మంచిదే కానీ కీడు చేసే ప్రధాన పాత్ర పోషిస్తున్నటువంటి టీవీ ప్రసారాలను కచ్చితంగా సమీక్షించ వలసిందే !అసంబద్ధం అర్ధనగ్న దృశ్యాలు అసాంఘిక అంశాలకు మద్దతిచ్చే సీరియల్లు ప్రసారాలను నిషేధించవలసిందే ! ఆ వైపుగా ఉమ్మడిగా కృషి జరగాల్సినటువంటి అవసరం చాలా ఉన్నది.

**– త్రుణీ కరించవలసిన మరికొన్ని.....**

ఆత్మీయంగా పలకరించుకున్న సందర్భం కనిపించదు, ద్వేషాలు అసూయలు, కొట్లాటలు ఈర్ష్య , ప్రతి విషయాన్ని సవాల్ గా తీసుకోవడం, ఎలా సాధిస్తారో చూస్తాం, ఎలా శోభనం చేస్తారో చూస్తాం, ఎలా పెళ్లి జరుగుతుందో చూద్దాం, భార్యాభర్తలు కలిసి ఉండకుండా విడదీయడానికి చేసే ప్రయత్నాలు, మెడనిండా కిలోల కొద్ది బంగారం గొలుసులు, ఖరీదైన బంగాళాలు కార్లు, సామాన్య జీవితానికి కనీసం ప్రవేశం కూడా లేనటువంటి కుటుంబ వాతావరణం సర్వసాధారణం. పెట్టుబడిదారీ విధానానికి వంతపాడే టీవీ ప్రసారాలు సీరియల్ లను పెంచి పోషించడం అనైతిక పద్ధతి అని ఇప్పటికైనా ప్రభుత్వాలు గుర్తించాలి, వాటిని నిర్మించి నిర్వహించే సంస్థలు గుణపాఠం తెచ్చుకోవాలి, బాధ్యతను గుర్తించాలి. కథ సంభాషణలు రాసే రచయితలు సామాజిక బాధ్యతగా సోయి తెచ్చుకొని మార్పును ఆశించే వైపుగా కృషి చేయాలి. మహిళా నటులు న్యాయ నిర్ణేతలు ఇతర చోట్ల మహిళలు నిర్వహిస్తున్నటువంటి అశ్లీల పాత్రలను సన్నివేశాలను దృశ్యాలను డ్రెస్సింగ్ ను పౌర సమాజంతో పాటు ముఖ్యంగా మహిళా సంఘాలు ఎక్కడికక్కడ నిరసించాలి. విప్లవ సంఘాలు ప్రజా సంఘాలు పోరాడితే తప్పకుండా ఈ విషయంలో మార్పు సాధించవచ్చు. సమాజాన్ని నిట్ట నిలువునా చీ లుస్తూ అనేక రుగ్మతలకు ఆజ్యం పోస్తున్నటువంటి అసంబద్ధ జీవితాలను చూపించే టీవీ ప్రసారాలు తప్పుడు విధానాలను ప్రోత్సహిస్తున్నాయనే చైతన్యం లేకపోవడమే విచారకరం ! ఆ వైపుగా ప్రేక్షకులు దృష్టి సారించి సమాజం కుటుంబ బాగుకు భిన్నంగా ప్రవర్తిస్తున్నటువంటి టీవీ ప్రసారాల యాజమాన్యాల పై నిరసన తెలుపగలిగే చైతన్యాన్ని నింపుకోవడం తద్వారా మార్పును సాధించడం ద్వారా సమాజం మరింత ఉన్నతమైన స్థితికి చేరుకోవాలని కోరుకోవడమే మన ఉమ్మడి లక్ష్యం కావాలి . సామాజిక మార్పుకు బలవత్తర సాధనమైన టీవీ ప్రసారాలు ఆ వైపుగా సహకరించాలని మనసారా కోరుకుంటూ ఎక్కడికక్కడ సమీక్షించుకొని తమ తమ పొరపాట్లను సవరించుకొని చైతన్యముతో ముందుకెళ్లడమే మన అందరి ముందున్నటువంటి కర్తవ్యం.

# సమస్యల వలయంగా బస్టాండ్

- చిమ్మచీకటిలో ప్రయాణికుల అవస్థలు
- మరమ్మతులకు నోచుకోని మరుగుదొడ్లు
- కుర్చీలు, మంచినీటి వసతి కరువు

**తరంగాలు/ హైదరాబాద్:** మండల కేంద్రంలలో ఆర్టీసీ బస్టాండ్లు అధ్వాన్నంగా మారుతున్నాయి. లక్షలు వెచ్చించి నిర్మించిన బస్టాండ్ కొన్నేండ్లుగా వృథాగానే ఉండిపోతున్నాయి. భూవివాదం కారణంగా ప్రారంభమైన మూన్నాళ్లకే మూతబడింది. దీంతో బస్టాండ్లో కాకుండా అంబేద్కర్ చౌరస్తా వద్ద బస్సులను ఆపడం మొదలు పెట్టారు. కొన్ని నెలల తరువాత భూ వివాదం తొలిగిపోవడంతో అప్పటి రవాణాశాఖ మంత్రి కొన్ని నిధులను కేటాయించి బస్టాండ్కు మరమ్మతులు చేపట్టారు. తిరిగి బస్టాండ్లో మళ్లీ బస్సులను ఆపడం మొదలుపెట్టారు. అయినప్పటికీ అది మూన్నాళ్ల ముచ్చటగానే మిగిలిపోయింది. చౌరస్తాకు బస్టాండ్ కాస్తాదూరం ఉండటంతో ప్రయాణికులు బస్టాండ్లోకి రావడానికి అనాసక్తిని చూపించారు. ఇదే అదునుగా బావించిన ఆర్టీసీ డ్రైవర్లు బస్సులను చౌరస్తా వద్దనే కొన్నేండ్లుగా అవుతున్నారు. దీంతో ప్రైవేటు వాహనాలు, పంచాయతీ పరిష్కారాలకు అడ్డగా మారింది. కానీ అంబేద్కర్ చౌరస్తా వద్ద కందుకూరు రోడ్డుతో కూడిన కూడలి ఉంది. ఒకప్పటితో పోలిస్తే ట్రాఫిక్ సమస్య ఒక్కసారిగా రెట్టింపయ్యింది. ప్రైవేట్ వాహనాలు క్రజర్లు,



ఆటోలు, ద్విచక్రవాహనాలు రోడ్డు కిరువైపులా నిలపడం, అక్కడే యూటర్న్ సౌకర్యం కలిగి ఉండటం, రోడ్ల పైనే చిరువ్యాపారులు దుకాణాలు ఏర్పాటు చేసుకోవడంతో ప్రజలు ప్రయాణికులు నిత్యం నరకం చూస్తున్నారు. ట్రాఫిక్ బారులు తీరుతుంది. ఇటీవల మహిళలకు ఉచిత ప్రయాణంతో బస్సులు నిమిషాల తరబడి నిలపడంతో ట్రాఫిక్ సమస్య జఠిలమయ్యింది. దీనికి పరిష్కారం చూపుతూ ఆర్టీసీ బస్సులను బస్టాండ్లో నిలపాలని నిర్ణయం తీసుకున్నారు. కానీ, ప్రయాణికుల అవసరాలను తీర్చడంలో అధికారులు పూర్తిగా విఫలమయ్యారు. దీంతో వసతులు లేమితో సమస్యల వలయంలో యాచారం బస్టాండ్






కొట్టుమిట్టాడుతుంది.

**– కరెంట్ లేక ఇక్కట్లు**

బస్టాండ్లో అధికారులు కనీసం విద్యుత్ సౌకర్యాన్ని కల్పించలేకపోవడం గమనార్హం. కరెంట్ లేకపోవడంతో రాత్రిపూట బస్టాండ్ అంధకారాన్ని తలపిస్తుంది. దీంతో సాయంత్రం, తెల్లవారుజామున ప్రయాణికులు చీకట్లో ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. బస్టాండ్ ప్రాంగణంలో విద్యుత్ ఏర్పాటు చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు. సరిపడా కుర్చీలు ఏర్పాటు చేసి, బస్టాండ్లో ఉన్న దుకాణ షెట్టర్లను సైతం ఉపయోగంలోకి తీసుకురావాలని ప్రజలు, ప్రయాణికులు విజ్ఞప్తి చేస్తున్నారు.

జాతీయ దిన పత్రిక
RNI . TELTEL / 2022 / 83463
తరంగాలు
Tharangalu Daily News Paper

బుధవారం, 07-02-2024

## తెలంగాణ ప్రభుత్వం అనూహ్య నిర్ణయం

- గ్రూప్-1లో మరో 60 పోస్టులు పెంచాలని నిర్ణయం



**తరంగాలు/హైదరాబాద్:** నిరుద్యోగులకు తెలంగాణ ప్రభుత్వం గుడ్ న్యూస్ చెప్పింది. గ్రూప్-1లో మరో 60 పోస్టులు పెంచుతూ తెలంగాణ ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. గతంలో 503 పోస్టులకు తెలంగాణ ప్రభుత్వం నోటిఫికేషన్ విడుదల చేసింది. రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీసుకున్న తాజా నిర్ణయంతో గ్రూప్-1 పోస్టుల సంఖ్య 563కి చేరాయి. 2022 ఏప్రిల్ లో 503 పోస్టులకు టీఎస్‌పీఎస్‌సీ నోటిఫికేషన్ విడుదల చేసింది. ఈ నోటిఫికేషన్ సమయంలో 3,50,000 మంది దరఖాస్తు చేసుకున్నారు. 2022 అక్టోబర్‌లో గ్రూప్ 1 ప్రిలిమ్స్ పరీక్ష నిర్వహించగా.. 2,80,000 మంది హాజరయ్యారు. అయితే, ప్రిలిమ్స్ ఫలితాలు విడుదలైనా.. పేపర్ లీకేజ్ కారణంగా ఆ పరీక్ష రద్దైంది. దాంతో 2023 జూన్‌లో మళ్లీ పరీక్షలు నిర్వహించారు. దీనిపై పలువురు అభ్యర్థులు కోర్టును ఆశ్రయించగా.. పరీక్షల నిర్వహణలోని లోపాల నేపథ్యంలో పరీక్షలను రద్దు చేయాలని కోర్టు తీర్పునిచ్చింది.

## కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే వస్తుంది

- మోదీ ఆ ఘనత కూడా సాధించారు



**తరంగాలు/వరంగల్:** కేంద్రంలో మళ్లీ బీజేపీ ప్రభుత్వమే వస్తుందని మాజీమంత్రి ఈటల రాజేందర్ కీలక వ్యాఖ్యలు చేశారు. మంగళవారం నాడు నర్సంపేటలో ఈటల రాజేందర్ పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మీడియాతో మాట్లాడుతూ ఏప్రిల్‌లో జరగబోయే పార్లమెంట్ ఎన్నికలకు బీజేపీ సర్వసన్నద్ధమవుతుందని తెలిపారు. తెలంగాణ ప్రజలందరూ ఈసారి కూడా కేంద్రంలో బీజేపీ ప్రభుత్వానికే పట్టం కట్టబోతున్నారని ధీమా వ్యక్తం చేశారు. దేశ రాజకీయాల్లో సంకీర్ణ ప్రభుత్వాల ఏర్పాట్లు లేకుండా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ చేశారన్నారు. ప్రపంచంలో భారతదేశానికి అత్యంత గుర్తింపు తెచ్చిన ఘనత మోదీదేనని చెప్పారు. రాష్ట్రంలో దళిత బంధు, బీసీ బంధుతో ప్రజలను బీఆర్ఎస్ అధినేత కేసీఆర్ మోసం చేశారని ఇప్పుడు ఎక్కడ ఉన్నారని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం అమలు కాని హామీలతో ప్రజలను మభ్యపెట్టి ఎన్నికల్లో ఓట్లు దండుకొని గద్దెనెక్కిందని వాటిని ప్రజలు గమనిస్తూనే ఉన్నారని ఈటల రాజేందర్ అన్నారు.

## రాష్ట్రస్థాయి బాల్ బ్యాడ్మింటన్ పోటీలకు కూనూరు విద్యార్థులు ఎంపిక

- విద్యార్థులను అభినందించిన ప్రధానోపాధ్యాయులు పర్వేజ్



**తరంగాలు ప్రతినిది-జఫర్గడ్**
కూనూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులు బాల్ బ్యాడ్మింటన్ పోటీలలో రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పి ఈ టి యాదగిరి తెలియజేశారు. ఆదివారం జేఎన్ఎస్ స్టేడియంలో జరిగిన జిల్లా స్థాయి పోటీలలో ఉత్తమ ప్రతిభ కనబరిచి పల్లె గౌతమి, సుతారి రిషిత, శనబోయిన పూజ ఎంపికైనట్లు తెలిపారు. ఈ నెల 9, 10, 11 తేదీలలో హైదరాబాదులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలలో వీరు పాల్గొంటారని తెలిపారు. ఈ సందర్భంగా ఎంపికైన విద్యార్థులను పాఠశాల ప్రధానోపాధ్యాయులు పర్వేజ్, ఉపాధ్యాయులు వెంకటేశ్వర్లు, రమేష్ బాబు, రవి, గిరిజ, స్వరూప రాణి, రాజేందర్, వేణుగోపాల్, విజయశ్రీ, కరుణశ్రీ, శంకర్, ఉమా, శ్రీనివాస్ అభినందించారు.

## జాతి స్థాయిలో గాయనిగా గుర్తింపు పొందిన కొమ్ము రమను అభినందించి సన్మానించిన మంత్రి తుమ్మల



**తరంగాలు-ఖమ్మం జిల్లా బ్యూరో**
ఖమ్మంలో జరిగిన మైనారిటీ గ్రామీణ వైద్యుల మహాసభకు సింగర్ కొమ్ము రమ ను ఆహ్వానించారు. తన పాటలతో అందరినీ ఆనందింప చేసి అలరించారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ముఖ్యమంత్రి తుమ్మల నాగేశ్వరరావు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఖమ్మం జిల్లా సుబ్బులేడు గ్రామానికి చెందిన నిరుపేద కుటుంబంలో చిన్నతనం నుండే జానపద పాటలు పాడుతూ, ఇటీవల హైదరాబాదులో జరిగిన దూరదర్శన్ టీవీ ఛానల్ వారు నిర్వహించిన రాష్ట్రస్థాయి జానపద పోటీల్లో మొదటి స్థానంలో నిలిచి అలాగే బొంబాయిలో జరిగిన జాతీస్థాయి జానపద పోటీల్లో పాల్గొని తెలంగాణ రాష్ట్ర ఖ్యాతిని తన పాటతో చాటి చెప్పారు. ఈ కార్యక్రమంలో ప్రముఖ మల్టిపుల్ గాయకుడు మూసా, రైటర్ సింగర్ ఫక్రుద్దీన్ , గ్రామీణ వైద్యుల వ్యవస్థాపక అధ్యక్షులు నజీరుద్దీన్, జిల్లా అధ్యక్షులు హసన్, గౌరవ అధ్యక్షులు నేరేడ హసన్ , సెక్రటరీ జాన్ మియా, కోశాధికారి బాబు సాహెబ్ ల ఆధ్వర్యంలో కొమ్ము రమ ను తుమ్మల నాగేశ్వరరావు ఘనంగా సన్మానించారు. జాతి స్థాయిలో గాయనిగా గుర్తింపు పొందినందుకు ఖమ్మం జిల్లా వాసులు హర్ష వ్యక్తం చేశారు .

# కబరస్థానం స్థలం కబ్జా

- అగ్రహిస్తున్న ముస్లిం కులస్తులు
- స్థానిక తాసిల్దార్ విచారణ చేపట్టాలి.

**పినపాక/తరంగాలు**
పినపాక మండల కేంద్రంలోని చెరువు శివారులో ప్రభుత్వ భూమి 512/1 సర్వే నెంబర్లు 2.05 గుంటల భూమిని గతంలో అధికారులు ప్రభుత్వం స్థలాన్ని ముస్లిం కులస్తులకు సర్వే నిర్వహించి కబరస్థానం కేటాయించారు. ఈ భూమిని కొందరు కబ్జా చేసి పంట వేస్తూ సాగు చేస్తున్నారు. దీంతో ముస్లిం కులస్తులు మరణించినప్పుడు స్థలం లేక ఇబ్బందుల గురవుతున్నామని ముస్లిం కులస్తులు అగ్రహిస్తున్నారు. స్థానిక రెవిన్యూ అధికారులు ఈ స్థలంపై విచారణ చేపట్టి కబ్జాదారులపై చర్యలు చేపట్టాలని కోరుచున్నారు.

కబరస్థానం కబ్జా దుర్మార్గం: పినపాక కాంగ్రెస్ మైనార్టీ గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ దస్తగిరి

మండల కేంద్రంలోని కభరస్థానం కబ్జా చేయడం



దుర్మార్గం మనీ కాంగ్రెస్ పార్టీ పినపాక గ్రామ శాఖ అధ్యక్షుడు షేక్ దస్తగిరి అన్నారు. ప్రభుత్వం ముస్లింలకు 512/1 సర్వే నెంబర్లు 2.05 గుంటల భూమిని. పినపాక చెరువు శివారులో ఆనాడు రెవెన్యూ అధికారులు సర్వే నిర్వహించి ముస్లిం సోదరులకు ఇచ్చిన స్థలాన్ని కొందరు కబ్జా చేసి సాగు చేయడం ఎంతవరకు న్యాయమన్నారు. రెవెన్యూ అధికారులు తక్షణమే విచారణ చేపట్టి ముస్లిం సోదరులకు న్యాయం చేయాలని



కోరుచున్నారు.

**కబ్జాదారులపై చర్యలు చేపట్టాలి: మైనార్టీ నాయకుడు సైద్ మామ్**

పినపాక చెరువు కింద కబ్జా అయిన స్థలాన్ని అధికారులు చర్యలు చేపట్టి కబరస్థానం స్థలాన్ని ముస్లింలకు అప్పగించాలని పినపాక గ్రామ మైనార్టీ నాయకుడు కోరారు. కబ్జా చేసిన వ్యక్తులపై చర్యలు తీసుకొని కేసులు నమోదు చేయాలని కోరారు.

## అత్యంత పారదర్శకంగా ఈవీఎంల మొదటి దశ తనిఖీ

- ఎఫ్ఎల్సీ ప్రక్రియను పరిశీలంచిన కలెక్టర్ పి.ప్రావీణ్య...



తరంగాలు/వరంగల్ జిల్లా ప్రతినిధి: ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియ వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధుల సమక్షంలో ఈసీఐఎల్ ఇంజనీర్ల ఆధ్వర్యంలో అత్యంత పారదర్శకంగా నిర్వహించేందుకు అన్ని చర్యలు తీసుకుంటున్నట్లు వరంగల్ జిల్లా కలెక్టర్ ప్రావిణ్య తెలిపారు. మంగళవారం వరంగల్ ఎనుమాముల వ్యవసాయ మార్కెట్ యార్డ్ లోని కొనసాగుతున్న ఈవీఎం ఎలక్ట్రానిక్ ఓటింగ్ యంత్రాల మొదటి దశ తనిఖీ (ఎఫ్ఎల్సీ) ప్రక్రియను జిల్లా కలెక్టర్ పి. ప్రావీణ్య పరిశీలించారు. భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు త్వరలో జరిగే లోకసభ ఎన్నికల దృష్ట్యా ఈవీఎంల ఫస్ట్ లెవెల్ చెకింగ్ ప్రక్రియ ఈనెల 5 నుండి 14వ తేదీ వరకు కొనసాగుతుందని అన్నారు. జిల్లాలోని వరంగల్ తూర్పు, వర్ధన్నపేట, నర్సంపేట నియోజక వర్గాలకు సంబంధించిన ఈవీఎంల మొదటి దశ తనిఖీ ప్రక్రియ లో 1906 బ్యాలెట్ యూనిట్లు, 1262 కంట్రోల్ యూనిట్లు, 1219 వివి ప్యాట్ల ను అధికారులు సాంకేతిక నిపుణులు తనిఖీ నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఎఫ్ఎల్సి నిర్వహిస్తున్న 9 మంది ఈసిఐ ఎల్ ఇంజినీర్లు, అధికారులు, సాంకేతిక నిపుణులతో ఇప్పటివరకు చేపట్టిన ప్రక్రియను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్డీఓ వాసు చంద్ర, తహశీల్దార్లు ఇక్బాల్, నాగేశ్వర్ రావు, కలెక్టరేట్ ఎన్నికల పర్యవేక్షకులు విశ్వ నారాయణ, నాయబ్ తహశీల్దార్లు, ఎన్నికల విభాగం సిబ్బందితోపాటు ఈసీఐఎల్ ఇంజనీర్లు, రాజకీయ పార్టీల ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

## కిరాణా షాపుల్లో చాక్లెట్లు కొంటున్నారా.. ఒకసారి చెక్ చేసుకోండి...

- సీఐ శివ ప్రసాద్



**పినపాక/తరంగాలు:** కిరాణా షాపుల్లో చాక్లెట్లు కొంటున్నారా మనం తినే చాక్లెట్లేనా లేక మత్తెక్కించే గంజాయి చాక్లెట్లా చూసుకోవాలని సిఐ శివప్రసాద్ సూచించారు. మంగళవారం రాత్రి జిల్లా ఎస్పీ ఆదేశాల ప్రకారం పినపాక మండలం ఏడూళ్ల బయ్యారంలో సీఐ శివప్రసాద్ ఆధ్వర్యంలో దుకాణాల తనిఖీ నిర్వహించారు. దుకాణాల్లో అమ్మే చాక్లెట్లను పరిశీలించారు. గంజాయి చాక్లెట్లను విక్రయిస్తుండటం ఆందోళన కలిగిస్తోందన్నారు. యువతను లక్ష్యంగా చేసుకొని ఈ దందా కొనసాగించేందుకు అక్రమార్కులు ప్రయత్నం చేస్తున్నారన్నారు. కానీ వారి ప్రయత్నాలను పోలీస్ శాఖ అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉంటూ చిత్తు చేస్తున్నారన్నారు. అయితే యువతతో పాటు వారి తల్లిదండ్రులు ఈ గంజాయి చాక్లెట్ల విషయంలో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. యువత, చిన్నపిల్లలు తెలియకుండా ఈ చాక్లెట్లు కొనుగోలు చేసి తింటే వాటికి బానిసలై భవిష్యత్తులో తీవ్ర పరిణామాలు ఎదుర్కోవాల్సి వస్తుందనన్నారు. గంజా చాక్లెట్లను దుకాణాల్లో విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

## అండర్ 14 రబ్బీ ఛాంపియన్స్‌గా ఐనవోలు ఎం.జె.పి విద్యార్థులు...



**తరంగాలు ప్రతినిధి/వర్ధన్నపేట:** వర్ధన్నపేట మండలం ఉప్పరపల్లి క్రాస్ వద్ద గల మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాల ఐనవోలు విద్యార్థులు 6వ రాష్ట్ర స్థాయి అండర్ 14 రబ్బీ ఛాంపియన్ షిప్ లో విజయం సాధించారు. 800 వందల మంది పాల్గొన్న టోర్నీలో ఛాంపియన్స్ గా నిలిచి యాదాద్రి భువనగిరి ఎమ్మెల్యే బిర్ల ఐలయ్య చేతులమీదుగా అవార్డ్ అందుకున్న విద్యార్థులను పి.ఈ.టి సందీప్ ను పాఠశాల ప్రిన్సిపాల్ రాజేంద్రచారి అభినందించారు. ఈ కార్యక్రమంలో ఏటిపి అశోక్ ,వార్డెన్ శ్రీలత, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

## తెలంగాణ ఫోటో గ్రాఫర్స్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి గా గుణగంటి సారయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి గా రాయ నారాయణ రెడ్డి నియామకం







**పినపాక/తరంగాలు:** తెలంగాణ రాష్ట్ర ఫోటో అండ్ వీడియో గ్రాఫర్స్ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి గా పినపాక గ్రామానికి చెందిన గుణగంటి సారయ్య, రాష్ట్ర సహాయ కార్యదర్శి గా ఏడూళ్ళ బయ్యారం గ్రామానికి చెందిన రాయ నారాయణ రెడ్డి లను నియమించడం జరిగింది. మంగళవారం హైదరాబాద్ లోని సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో జరిగిన రాష్ట్ర కార్యవర్గ సమావేశం లో రాష్ట్ర అధ్యక్షులు ఎస్ కె హుస్సేన్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రాపర్తి శ్రీనివాస్ గౌడ్ చేతుల మీదుగా నియామక పత్రం అందజేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అధ్యక్షులు కీసర సుధాకర్ రెడ్డి, గౌరవ అధ్యక్షులు మారుతీ ప్రకాష్, జిల్లా కన్వీనర్ పంపన రమేష్, జిల్లా ప్రధాన కార్యదర్శి వనచర్ల రామకృష్ణ, కోశాధికారి, బల్లెం అనిల్, జిల్లా కన్వీనర్ తదితరులు పాల్గొన్నారు.

## తుమ్మలను కించపరిస్తే సహించేది లేదు

**తుమ్మల అభిమానపాత్రుడు కోలేటి భవానీ శంకర్**



**పినపాక/తరంగాలు:** తుమ్మల వ్యక్తిత్వం తెలిసిన వారెవరు ఇలాంటి తప్పుడు వార్తలు పెట్టరు. మంత్రివర్గ సమావేశంలో రేవంత్ తుమ్మల మధ్య మాటల యుద్ధం జరిగిందని, నీ భాష బాగాలేదని తుమ్మల అంటే, ఏం చేయాలో ఎలా మాట్లాడాలో నాకు తెలుసు అని రేవంత్ రెడ్డి అన్నాడని వార్త వచ్చింది. అసలు క్యాబినెట్ మీటింగ్ లో ఏదైనా రహస్యం మాట్లాడాలనుకుంటే సమావేశం తర్వాత అధికారులను బయట పంపించి మంత్రులు మాట్లాడుతారు. ఆ విషయం తెలియని మూరు?లు ఇలాంటి వార్తలను పెడుతున్నారు. ఒకవేళ మాటపడే పరిస్థితి వస్తే ఒక నిమిషం కూడా ఆయన పదవిలో ఉండడని పదవుల కోసం ప్రాకులాడే వ్యక్తి తుమ్మల కాదు అని, ఈ విషయం గుర్తుంచుకోవాలని, ఎన్టీఆర్ చంద్రబాబు నాయుడు కేసీఆర్ లే ఆయనను గౌరవించే వారిని ఇలాంటి వార్తలు సృష్టించేవారు అబాసుపాలు అవుతారని, ఎవరెస్టు పర్వతమంత ఎత్తులో ఆయన వ్యక్తిత్వం ఉంటుందని, ఇలాంటి తప్పులు వార్తలు సృష్టించవద్దని హితవు పలుకుతున్నాను.

# క్యాలెండర్,డైరీ ఆవిష్కరణ

- డిఎస్పి వెంకటగిరి

**తరంగాలు-మిర్యాలగూడ ప్రతినిధి**



మిర్యాలగూడ డిఎస్పి కార్యాలయంలో డిఎస్పి వెంకటగిరి చేతుల మీదుగా బీసీ విద్యుత్ ఉద్యోగుల క్యాలెండర్ మరియు డైరీ ని మంగళవారం ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో బీసీ విద్యుత్ ఉ ద్యోగుల జేఏసీ అధ్యక్షుడు మారం శ్రీనివాస్, బీసీ సంగం నాయకులు చేగొండి మురళీ యాదవ్ ,దాసరాజు జయరాజు , నల్లగంతుల నాగభూషణం, సుధాకర్,,విద్యుత్ ఉద్యోగులు, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

# కోలాటం నృత్య బృందం సభ్యులకు ఆర్థిక సహాయం

- రూ.5 వేలు అందజేసిన కొండ భాస్కర్

**తరంగాలు-మిర్యాలగూడ ప్రతినిధి**

కంపాసగర్ గ్రామపం చాయతీ పరిధిలో ఉన్న అవాస గ్రామమైన కోమ టిగూడెంలో కోలాటం నేర్చుకుంటూన్న మహి ళలకు కొండ భాస్కర్ 5 వేల రుపాయలు ఆర్థిక సహాయం అందజేశారు. ఈ సందర్భంగా కోలాటం నృత్య బృందం సభ్యులు కొండ భాస్కర్ కు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు అర్వెనబోయిన వెంకన్న, అర్వెనబోయిన రాంబాబు, జొన్నలగడ్డ వెంకన్న, జిట్టబోయిన నాగరాజు, బుర మదు,డాక్టర్ లక్ష్మణ్, మేకల శంకర్, జొన్నలగడ్డ నరేష్, జొన్నలగడ్డ కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.



# టమాట తోటను సందర్శించిన వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల

**తరంగాలు-ఖమ్మం జిల్లా బ్యూరో ఖమ్మం రఘునాథపాలెం**



మంగళవారం ఖమ్మం జిల్లా రఘునాథపాలెం మండలం వెంకటాయపాలెం గ్రామంలో గిరిజన రైతు బానోత్ కిషోర్ నాయక్ కూరగాయలు సాగు చేస్తున్న టమాట తోటని రాష్ట్ర వ్యవసాయ, చేనేత మార్కెటింగ్ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా స్థానిక రైతులతో మంత్రి తుమ్మల మాట్లాడుతూ. కూరగాయల పంటలపై రసాయన మందులు తక్కువగా ఉపయోగించి సాగు చేయాలని కోరారు.వాణిజ్య పంటలలోని ఒకటైన పామాయిల్ సాగు వల్ల రైతులకు ఎంతో లాభం చేకూరుతుందని అన్నారు. ఆకుకూరలు సాగు చేసే రైతులకు ఆకుకూరలు నిలువ చేయుటకు మార్కెట్లో కొత్తగా వచ్చిన ప్రత్యేకమైన సంచులు ఉపయోగించడం వలన ఆకుకూరలు ఎక్కువ సమయం నిలువ ఉంటాయని అన్నారు. వాణిజ్య పంటలైన కూరగాయలను నిలువ ఉంచి గిట్టుబాటు ధరలకు అమ్ముకునే విధంగా మరియు మరియు ఒక ప్రాంతం నుండి మరో ప్రాంతానికి తరలించి అమ్ముకునే విధంగా కొత్తగా మినీ వ్యాన్లపై కేబుల్ ద్వారా ఏసి లను మార్చుకునే టందుకు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు సబ్సిడీ ద్వారా అందిస్తుందని,వాటిని రైతులు వినియోగించుకోవాలని అన్నారు.

# ఘనంగా మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ జన్మదిన వేడుకలు

- రోగులకు పండ్లు, అల్పాహారం పంపిణీ



మున్సిపల్ మాజీ చైర్ పర్సన్ తిరునగరు నాగలక్ష్మి భార్గవ్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మిర్యాలగూడ ఏరియా హాస్పిటల్ లో లయన్స్ క్లబ్ ఆద్వర్యంలో మీల్స్ ఆన్ వీల్స్ కార్యక్రమంలో టి ఎన్ బి ఫౌండేషన్ తరపున రోగులతో సహాయకులకు అల్పాహారం, పండ్లు పంపిణీ చేశారు.



# ఏబీవీపీ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నర్సంపేటలో నిరసన

- విద్యార్థులను హత్యచేసిన ఆటో డ్రైవర్ కు ఉరి శిక్ష విధించాలి
- హాస్టల్ వార్డెన్ ను సస్పెండ్ చేసి చట్టపరమైన చర్యలు తీసుకోవాలి
- ఏబీవీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్

**తరంగాలు-నర్సంపేట**

అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ వరంగల్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో నర్సంపేట పట్టణంలోని అమరవీరుల స్థూపం వద్ద విద్యార్థులతో ధర్నా కార్యక్రమం నిర్వహించడం జరిగింది, ఈ కార్యక్రమంలో ఏబీవీపీ వరంగల్ జిల్లా కన్వీనర్ గజ్జల దేవేందర్ పాల్గొని మాట్లాడుతూ.. భువనగిరి ఎస్సీ బాలికల హాస్టల్ లో వార్డెన్ మరియు ఆటో డ్రైవర్ కలిసి ఇద్దరు పదవ తరగతి చదువుతున్న విద్యార్థులను హత్య చేసి చంపి ఆత్మహత్యగా చిత్రీకరించేందుకు ప్రయత్నం చేశారు, కానీ ఇది ముమ్మాటికీ వార్డెన్ మరియు ఆటో డ్రైవర్ చేసిన హత్యే కానీ ప్రజల దృష్టిని మళ్లించడానికి కట్టు కథలు అల్లుతున్నారని అన్నారు. హత్య జరిగి రెండు రోజులు అవుతున్న ఇప్పటివరకు ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటని ఎద్దేవా చేశారు. ఎలక్షన్ల ముందు తమ ప్రభుత్వం ఏర్పాటు చేస్తే ప్రతి మహిళలకు రక్షణ కల్పిస్తామని బూటక మాటలు చెప్పి గద్దెనెక్కిన సీఎం నేడు భువనగిరి ఎస్సీ హాస్టల్లో హత్యలు జరుగుతుంటే కనీసం ఈ విషయంపై స్పందించకపోవడం సీఎంకు సిగ్గుచేటు అన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి, సిగ్గుతెచ్చుకొని ఆ ఇద్దరి బాధిత విద్యార్థుల కుటుంబాలకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. మరియు హాస్టల్ వార్డెన్ ను విధుల్లోంచి తొలగించి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని అలాగే హత్య చేసిన ఆటో డ్రైవర్ పై చట్టపరంగా



అరెస్టు చేసి ఉరి శిక్ష విధించాలని కోరారు, మరియు రాష్ట్రంలో ప్రభుత్వం ఏర్పడి నెలలు గడిచిపోతున్న ఇప్పటివరకు విద్యాశాఖ మంత్రినీ నియమించకపోవడం ప్రభుత్వానికి సిగ్గుచేటు అని మండిపడ్డారు. ఇప్పటికైనా విద్యాశాఖ మంత్రి నియమించి విద్యా వ్యవస్థపై దృష్టి పెట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో కార్యకర్తలు గణేష్,నిఖిల్, వంశీ,శ్రీకాంత్,సంతోష్, మోహన్, కిషోర్, నితిన్ తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ పంచాయితీ విధులను ప్రత్యేక అధికారులు సమర్థవంతంగా నిర్వర్తించాలి

- పేదలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలి
- ఖమ్మం కలెక్టర్ వి పి.గౌతం



**తరంగాలు-ఖమ్మం జిల్లా బ్యూరో**

ఖమ్మం గ్రామ పంచాయతీ విధులను ప్రత్యేక అధికారులు సమర్థవంతంగా నిర్వహిస్తూ, ప్రజలకు అందే సేవలలో ఇబ్బందులు రాకుండా అప్రమత్తంగా ఉండాలని, నూతన పంచాయతీరాజ్ చట్టం ప్రకారం విధులను ప్రత్యేక అధికారులు కట్టుదిట్టంగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. మంగళవారం నూతన కలెక్టరేట్ లోని సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీలకు నియమించిన ప్రత్యేక అధికారులకు, గ్రామ పంచాయతీ విధులు, నూతన పంచాయతీ రాజ్ చట్టం, తదితర అంశాలపై ఏర్పాటుచేసిన శిక్షణా కార్యక్రమంలో కలెక్టర్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామాల్లో సర్పంచ్ ల పదవి కాలం ముగిసినందున మళ్ళీ పంచాయతీ ఎన్నికలు నిర్వహించే వరకు ప్రత్యేక అధికారులతో పాలన సాగించాలని ప్రభుత్వం నిర్ణయించిందని, గ్రామాలలో మంచి పరిపాలన అందించే అవకాశం మనకు లభించిందని, దానిని సద్వినియోగం చేసుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీలకు ప్రత్యేక అధికారులుగా నూతన పంచాయతీరాజ్ చట్టంపై అవగాహన పెంచుకొని విధులను కట్టుదిట్టంగా నిర్వహించాలని, పంచాయతీ నిధుల వినియోగం, బిల్లుల చెల్లింపు, అభివృద్ధి పనులు, తదితర అంశాలపై అవగాహన పెంచుకోవాలని కలెక్టర్ సూచించారు. గ్రామసభ, గ్రామ పంచాయతీ తీర్మానాలను స్కాన్ చేసి భద్రపరచాలన్నారు. నేడు గ్రామసభలు నిర్వహించాలని, నేటి నుండి ఈ నెల 15 వరకు ప్రత్యేక పారిశుద్ధ్య కార్యక్రమం చేపట్టాలని అన్నారు. డ్రై డే కార్యాచరణ చేయాలన్నారు. ఈ నెల 15న ప్రత్యేక గ్రామసభ చేపట్టి, పారిశుద్ధ్య కార్మికుల సన్మానం చేయాలని, యువతను పెద్దఎత్తున భాగస్వామ్యం చేయాలని అన్నారు. ప్రత్యేక అధికారులు ముఖ్యంగా గ్రామాలలో పారిశుద్ధ్య నిర్వహణ, త్రాగునీటి సరఫరాకు అధిక ప్రాధాన్యత కల్పించాల్సి ఉంటుందని కలెక్టర్ తెలిపారు. ప్రతి గ్రామ పంచాయతీ లో ప్రస్తుత పారిశుధ్య పరిస్థితిని గమనించాలని, చెత్త సేకరణ, ఇంటి వద్ద తడి, పొడి చెత్త వేరు చేయడం , గ్రామాలలో రోడ్డుపై చెత్త వేయకుండా ఉండడం వంటి వాటిపై ప్రజలకు అవగాహన కల్పించాలని అన్నారు. నీటి సరఫరా లీకేజీల లేకుండా చూడాలని, ఓపెన్ బావులను పూడ్చడానికి చర్యలు తీసుకోవాలని అన్నారు. గ్రామ పంచాయతీలలో ప్రభుత్వ కార్యాలయాలు, ఆసుపత్రులు, పాఠశాలలు, మార్కెట్ లలో ప్రత్యేక శ్రద్ధ వహించి పరిశుభ్రంగా ఉండే విధంగా చూడాలని కలెక్టర్ తెలిపారు. గ్రామాల్లో పచ్చదనం సంరక్షించే దిశగా మొక్కల సంరక్షణకు చర్యలు తీసుకోవాలని, అలాగే నర్సరీలను పరిశీలించి అక్కడ ఉన్న మొక్కల సంరక్షణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రజలకు సైతం ప్రత్యేక అధికారుల పాలనలో స్పష్టమైన మార్పు కనిపించాలని, చిరకాలం ప్రజలు గుర్తుంచుకొనేలా సేవలు అందించాలని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ బి. సత్యప్రసాద్, జెడ్పి సిఇఓ అప్పారావు, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, డిఆర్డీవో విద్యాచందన, డివిజనల్ పంచాయతీ అధికారులు ప్రభాకర్, పుల్లారావు, గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

# రాష్ట్రాన్ని అధోగతి పాలు చేశారు

- మిగులు బడ్జెట్ గా ఉన్న రాష్ట్రాన్ని అప్పులు కుప్పగా మార్చారు
- గత ప్రభుత్వం చేసిన తప్పుకు ఇప్పుడు శిక్ష అనుభవిస్తున్నం
- ఖమ్మంజిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షుల్లు దుర్గా ప్రసాద్,జావేద్

**తరంగాలు-ఖమ్మం జిల్లా బ్యూరో**

పది ఏండ్లుగా తెలంగాణ రాష్ట్రాన్ని పాలించిన బీఆర్ఎస్ పార్టీ రాష్ట్రాన్ని అధోగతి పాలు చేసిందని జిల్లా, నగర కాంగ్రెస్ అధ్యక్షుల్లు పువ్వాళ్ళ దుర్గా ప్రసాద్, మహమ్మద్ జావేద్ లు ఆరోపించారు. మంగళవారం స్థానికంగా వారు మాట్లాడుతూ సోనియా గాంధీ దనికంగా ఉన్న రాష్ట్రాన్ని అప్పగిస్తే ఖజానా అంతా ఖాళీ చేశారని విమర్శించారు. ఆర్థిక భారం ఉన్నప్పటికీ కాంగ్రెస్ పార్టీ ఎన్నికల మ్యానిఫెస్టోలో ప్రకటించిన ప్రతి హామీని అమలు చేయడం ప్రారబించిందని అందులో భాగంగా ఆరు



గ్యారెంటీల్లో రెండిటినీ విజయవంతంగా అమలు చేయడం జరుగుతుందని తెలిపారు. మరి కొద్ది రోజుల్లోనే మరో రెండు గ్యారంటీలు ఉచిత విద్యుత్ తో పాటు 500 కే గ్యాస్ సిలిండర్ ను పంపిణీ చేసే ప్రక్రియ కొనసాగుతుందని స్పష్టం చేశారు. బీఆర్ఎస్ నేతలు కారు కూతలు తప్పుడు ప్రచారాలు మానుకోవాలని హితవు పలికారు. గత ప్రభుత్వం చేసిన తప్పిదాల వల్లే నేడు పెన్షన్‌లు, రైతు బంధు పడటంలో జాప్యం జరుగుతుందని అన్నారు. ఎక్కడికక్కడ కమీషన్లు దండుకుని అన్ని వ్యవస్థలను భ్రష్టు పట్టించారని ఎద్దేవా చేశారు. కాంగ్రెస్ ప్రభుత్వం ఏర్పడిన నాటి నుండి అన్ని ప్రక్షాళన చేసుకుంటూ వస్తుందని అవినీతి అక్రమాలకు తావు లేకుండ ప్రజాపాలన అందించాలన్నదే ప్రభుత్వ ధ్యేయం అని తెలిపారు. బీఆర్ఎస్ నేతలు మైకులు పట్టుకొని నోటికి ఏది వస్తే అదే మాట్లాడుతున్నారని జిల్లా లో గత ప్రభుత్వంలో ఎంత అవినీతి జరిగిందో మొన్న కాంగ్రెస్ కు పోల్లైన ఓట్లే రుజువు చేశాయని తెలియాజేశారు. కేంద్రంలో కూడా రాభోయేది కాంగ్రెస్ ప్రభుత్వమే అని గతంలో కూడా కొందరు నేతలు రాష్ట్రంలో కాంగ్రెస్ పని ఖతం అయిందని పిచ్చి కూతలు కూశారని కానీ భారీ మెజార్టీతో ప్రజలు అధికారం కట్టబెట్టారని గుర్తు చేశారు. కేంద్రంలో ఉన్న కాంగ్రెస్ పార్టీ పై జిల్లాలో బీఆర్ఎస్ నేతలు విమర్శలు చేస్తున్నారని బిజెపి బీఆర్ఎస్ కలిసి కాంగ్రెస్ గెలుపును అడ్డుకొలేవు అని అన్నారు. అసెంబ్లీ లో ఓటమి పాలైన బిఆర్ఎస్ తన ఉనికి చాటుకోవడానికి పనికి మాలిన ఆరోపణలు చేస్తుందని పార్లమెంట్ ఎన్నికల తర్వాత బిఆర్ఎస్ కనుమరుగు అవ్వడం ఖాయమని ఆయన స్పష్టం చేశారు.

# మురికి కాల్వలు క్లీన్ చేయించిన కాంగ్రెస్ నాయకులు

**తరంగాలు-వరంగల్ జిల్లా ప్రతినిధి**

మంగళవారం రోజు వరంగల్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని 14 డివిజన్ సుందరయ్య నగర్ గ్రామ సమీపంలో ఉన్న మురికి కాల్వలో చెత్త పేరుకుపోయి దుర్వాసన వస్తూ దోమలు తయారై రోగాల బారిన పడుతున్నారని గ్రామ ప్రజలు తన దృష్టికి తీసుకొని రావడంతో తక్షణమే స్పందించి మున్సిపల్ కార్మికులను పిలిపించి దగ్గరుండి మురికి కాల్వలో పేరుకుపోయిన చెత్తను క్లీన్ చేయించిన 14వ డివిజన్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు సయ్యద్ ఇంతియాజ్.



# నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యం

- **ఖమ్మం జిల్లా కలెక్టర్ విపీ.గౌతమ్**

**తరంగాలు–ఖమ్మం జిల్లా బ్యూరో**

ఖమ్మం : నులిపురుగుల నివారణతోనే సంపూర్ణ ఆరోగ్యమని జిల్లా కలెక్టర్ వి.పి. గౌతమ్ అన్నారు. నూతన కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో ఈనెల 12వ తేదీన చేపట్టే జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమం (నేషనల్ డివార్మింగ్ డే) పై సోమవారం వైద్య ఆరోగ్య, విద్య, సాంఘిక సంక్షేమం, మున్సిపల్, మహిళ శిశు సంక్షేమం, గిరిజన సంక్షేమం, పంచాయతీ, గ్రామీణాభివృద్ధి తదితర శాఖల అధికారులతో జిల్లా టాస్క్ ఫోర్స్ కమిటీ సమావేశాన్ని కలెక్టర్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, జిల్లాలో 01- నుంచి 19 సంవత్సరాల లోపు బాల బాలికలకు నులిపురుగుల నివారణ మందు పంపిణీ చేసేందుకు అవసరమైన చర్యలను చేపట్టాలని అన్నారు. చిన్నారులలో అనారోగ్య సమస్యలకు కారణమవుతున్న నులిపురుగులను నివారించి ఆరోగ్యాన్ని మెరుగు పరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఈనెల 12వ తేదీన నులిపురుగుల నివారణ దినోత్సవాన్ని నిర్వహించనుందన్నారు. ప్రతి సంవత్సరం రెండు విడతలుగా, ఫిబ్రవరి, ఆగస్టు మాసాల్లో చేపడుతున్నట్లు ఆయన తెలిపారు. ఇందులో భాగంగా ప్రతి చిన్నారికి నులిపురుగుల నివారణ అల్బెండజోల్ మాత్రను తప్పక వేయించాలన్నారు. జిల్లాలో సుమారు 2 లక్షల 80 వేల 579 మంది 01-19 సంవత్సరాల వారు ఉన్నట్లు, వీరందరికి నులిపురుగుల నివారణ కోసం అల్బెండజోల్ మాత్రలు సరఫరా చేయాలని లక్ష్యంగా నిర్ధేశించడం జరిగిందన్నారు. పంపిణీ చేసిన మాత్రలను చిన్నారులకు అందజేసేందుకు ప్రణాళికను రూపొందించి అమలు చేయాలన్నారు. జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలల్లో, జూనియర్ కళాశాల, ఐటిఐ, పాలిటెక్నిక్, కళాశాలల్లోని విద్యార్థులతోపాటు, అంగన్వాడీ కేంద్రాల్లో పిల్లలకు ఆల్బెండజోల్ మాత్రలు అందించాలన్నారు. జిల్లాలోని ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలల యాజమాన్యాలతో సమావేశం నిర్వహించి అక్కడ విద్యార్థులందరకు అల్బెండజోల్ మాత్రలు అందంచేలా చర్యలు తీసుకోవాలన్నారు. అల్బెండజోల్ మాత్ర మూలంగా నులిపురుగుల నుండి ఏవిధమైన రక్షణ కలుగుతుంది, పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై విద్యార్థులకు ఉపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. నులిపురుగుల నిర్మూలనతో రక్తహీనత నియంత్రణ, పోషకాల గ్రాహ్యతను మెరుగుపరచే ప్రయోజనాలు కలుగుతాయన్నారు. జాతీయ నులిపురుగుల నిర్మూలన కార్యక్రమంలో భాగంగా 1 నుండి 2 సంవత్సరాల చిన్నారులకు సగం మాత్ర ను పొడిచేసి సులభంగా మింగగలిగేలా సురక్షితమైన నీరు కలిపి ఇవ్వాలన్నారు. 2 నుండి 19 సంవత్సరాల వయస్సు వారికి ఒక మాత్ర చొప్పున పంపిణీ చేసి వినియోగించేలా పర్యవేక్షణ చేయాలన్నారు. మాత్ర వేసుకొనని వారిని గుర్తించి ఈనెల 19వ తేదీన మాప్ ఆప్ రోజున వారికి ఇవ్వడం జరుగుతుందన్నారు. పారిశుద్ధ్య వాహనాలు, టాం టాం ద్వారా విస్తృత ప్రచారం చేయాలన్నారు. గ్రామసభల్లో ఎజెండాగా నులిపురుగుల నివారణ గురించి అవగాహన కల్పించాలన్నారు. బడి బయట పిల్లలు, వలస కార్మికుల కుటుంబాల పిల్లలపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ప్రజాప్రతినిధులను ఆహ్వానించి, కార్యక్రమ నిర్వహణలో భాగస్వామ్యం చేయాలన్నారు. వంద శాతం పిల్లలకు మాత్రలు అందజేసి, కార్యక్రమాన్ని విజయవంతం చేయాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జ్ జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. డి. రాములు నాయక్, డిసిహెచ్ఎస్ డా. వెంకటేశ్వర్లు, జెడ్పి సిఇఓ అప్పారావు, డిఆర్డీవో విద్యాచందన, జిల్లా ఇంటర్ మీడియట్ అధికారి రవిబాబు, జిల్లా విద్యాధికారి సోమశేఖరశర్మ, జిల్లా సాంఘీక సంక్షేమ అధికారి కె. సత్యనారాయణ, జిల్లా పంచాయతీ అధికారి హరికిషన్, జిల్లా సంక్షేమ అధికారిణి సుమ, జిల్లా గిరిజన సంక్షేమ అధికారిణి విజయలక్ష్మి, జిల్లా బిసి సంక్షేమ అధికారిణి జి. జ్యోతి, ఉప జిల్లా వైద్య ఆరోగ్య అధికారి డా. సైదులు, డిఐఓ డా. ప్రమీల, మైనారిటీ శాఖ ఆర్సీఓ ఎం.జె. అరుణకుమారి, బిసి సంక్షేమ శాఖ ఆర్సీఓ టి. అంజలి, అధికారులు తదితరులు పాల్గొన్నారు.



# బాధితులకు బాసటగా "పోలీస్ భరోసా కేంద్రం"



- **వరంగల్ పోలీస్ కమిషనర్ అంబర్ కిషోర్ ఝా**

**తరంగాలు ప్రతినిధి–జనగామ**

లైంగిక దాడులకు గురైన మహిళలు, బాలబాలికలకు భరోసా కేంద్రం ఆసరాగా నిలుస్తుందని వరంగల్ పోలీస్ కమిషనర్ తెలిపారు. జనగామ జిల్లా కేంద్రంలో ఉమేన్ సేఫ్టీ విభాగం ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటు చేసిన భరోసా కేంద్రాన్ని రాష్ట్ర పోలీస్ డిజిపీ రవి గుప్తాతో అడిషనల్ డిజిపీలు షికా గొయల్, మహేష్ భగత్ తో కలిసి వర్చువల్ ద్వారా జనగాంలో నూతనంగా నెలకొల్పబడిన భరోసా కేంద్రాన్ని ప్రారంభించారు. అనంతరం వరంగల్ పోలీస్ కమిషనర్, జనగామ జిల్లా కలెక్టర్ శివ లింగయ్య, డిసిపీ సీతారాం తో కల్సి శిలా ఫలాకాన్ని ప్రారంబించారు. ఈ సందర్భంగా పోలీస్ కమిషనర్ ఈ భరోసా కేంద్రం పనితీరును తెలియజేస్తూ లైంగిక దాడులకు గురైన బాధితులకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించబడుతుంది. ఇందులో భాగంగానే భాదితులకు న్యాయపరమైన సహకారంతో పాటు వైద్య, ఆర్థిక సహకారాన్ని అందించబడుతుంది. వీటితో పాటు బాధితులకు కౌన్సిలింగ్ నిర్వహించబడుతుంది. అవసరంనుకుంటే బాధితులకు భరోసా కేంద్రంలో ఆశ్రయం కల్పించబడటంతో పాటు బాధితులకు ప్రభుత్వం నష్టపరిహారన్ని అందించడం జరుగుతుంది. ఈ కేంద్రంలో లీగల్, మెడికల్ సిబ్బంది తో పాటు ఇతర సహాయ సిబ్బందికి సంబందించి పూర్తిగా మహిళలు విధులు నిర్వహిస్తారని. ముఖ్యం బాధితులు పోలీస్ స్టేషన్ కు వెళ్లనవసరం లేకుండా బాధితులకు పూర్తి స్థాయిలో సహాయ సహకారాలు అందించబడుతుందని పోలీస్ కమిషనర్ తెలిపారు. ఈ కార్యక్రమం జనగామ జిల్లా కలెక్టర్ శివ లింగయ్య, డీసీపీ సీతారాం, ఏసీపీ దేవేందర్ రెడ్డి, శ్రీనివాస్ రావు, జనార్ధన్ రెడ్డి, కృష్ణ తో పాటు వెస్ట్ జోన్ కు చెందిన ఇన్స్ స్పెక్టర్లు, సర్కిల్ ఇన్స్ స్పెక్టర్లు, ఎస్. ఐ లు, భరోసా కేంద్రం సిబ్బందితో పాటు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# సివిల్ సప్లై హమాలి కార్మికులనుల 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలి



- **ఏఐపియుసి జిల్లా ప్రధాన కార్యదర్శి గన్నారపు రమేష్**

**తరంగాలుప్రతినిది–వర్ధన్నపేట**

సివిల్ సప్లై కార్పొరేషన్ లో పని చేస్తున్న హమాలి కార్మికులను నాలుగవ తరగతి ఉద్యోగుల గుర్తించాలని ఏఐటీయూసీ జిల్లా ప్రధాన గన్నారపు రమేష్,సివిల్ సప్లై అమాలి వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షులు గుంపెల్లి మునీశ్వర్ అన్నారు. మంగళవారం సివిల్ సప్లై హమాలి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట సివిల్ సప్లై గోదాం వద్ద సమ్మె వాల్ పోస్టర్ ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గన్నారపు రమేష్,గుంపెల్లి మునీశ్వర్ మాట్లాడుతూ కేంద్రంలోని బిజెపి ప్రభుత్వం కార్మిక,కర్షక,ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తుందని అన్నారు,ఫిబ్రవరి16న జరిగే దేశ వ్యాపిత సమ్మెను జయప్రదం చేయాలని, ఈనెల 8వ తేదీన వరంగల్లోని డీసెంట్ ఫంక్షన్ హాల్ లో ఆల్ ట్రేడ్ యూనియన్ ఆధ్వర్యంలో జరుగు సదస్సును విజయవంతం చేయాలని కార్మికులకు పిలుపునిచ్చారు. కార్మికులు పోరాడి సాధించుకున్న 44 కార్మిక చట్టాలను విడదీసి కార్పొరేట్లకు అనుకూలంగా 4 కోడ్లుగా తయారు చేశారని కార్మికులాన్ని కట్టు బానిసలుగా చేసారని అన్నారు, కార్మిక వ్యతిరేక నాలుగు కోడులను వెంటనే రద్దు చేయాలని డిమాండ్ చేశారు,ప్రభుత్వ యజమాన్య సంస్థ సివిల్ సప్లై కార్పొరేషన్ లో హమాలీలు,స్వీపర్లు ,దినసరి కూలీల కంటే ధారణమైన పరిస్థితిలో పనిచేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు.బడా వ్యాపారులకు వందల కోట్ల రూపాయలు రాయితీలు ఇచ్చే ప్రభుత్వం పేద ప్రజలకు అన్నం పెట్టి సివిల్ సప్లై కార్పొరేషన్ను సేవా దృక్పథంతో కాకుండా వ్యాపార కోణంలో చూడటం సరికాదన్నారు.రాష్ట్ర ప్రభుత్వం సివిల్ సప్లై కార్పొరేషన్ గత ప్రభుత్వ బకాయిలను బహిర్గతం చేయాలని,మిల్లర్ల నుండి రావలసిన 11వేల కోట్లు వసూలు చేయాలని డిమాండ్ చేశారు.సివిల్ సప్లై కార్పొరేషన్ లో పనిచేస్తున్న హమాలీలు స్వీపర్లకు పెరిగిన ధరలకు అనుకూలంగా బస్తా రేట్ ను క్వింటాల్కు రూ. 35 పెంచాలని ఎఫ్ సి ఐ మాదిరిగా హమాలీలను నాలుగో తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు.350 కిలోల బెల్సుకు ఒక్కటికి ఎగుమతి దిగుమతికి రూ.200 పెంచాలని దసరా పండుగ సందర్భంగా ఇచ్చి స్వీట్ కు 1200 కు పెంచాలని కోరారు.ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని హమాలీ కార్మికులకు ఇన్సూరెన్స్ సౌకర్యం కల్పించాలని బోనస్ను 10వేలుకు పెంచాలని డిమాండ్ చేశారు.రిటైర్డ్ అయిన హమాలీ కార్మికులకు ప్రావిడెంట్ ఫండ్ పెన్షన్స్ సౌకర్యం కల్పించాలని.యూనిఫామ్ కుట్టుకూలి రూ. 2000కు పెంచాలని,గోడౌన్లలో కార్మికుల అవసరాన్ని బట్టి కార్మికులు తీసుకుని అధికారం కల్పించాలని డిమాండ్ చేశారు.ప్రభుత్వం కార్మికుల సమస్యలు పరిష్కరించాలని, కార్మికులు తమ సమస్యలను పరిష్కారం కోసం జరిగే ఉద్యమాలకు సిద్ధం కావాలని కోరారు,కనీస వేతనం 26వేలు ఇవ్వాలని,సమాన పనికి సమాన వేతనం చెల్లించాలని,కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు.ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా ఉపాఅధ్యక్షులు ఎండి యాకూబ్, సివిల్ సప్లై యూనియన్ వరంగల్ జిల్లా అధ్యక్షులు జలగం బిక్షపతి,జిల్లా ప్రదాన కార్యదర్శి ల్యాదెళ్ల ఆరోగ్యం, వర్ధన్నపేట మండల పాయింట్ అధ్యక్షులు జలగం మోహన్, ఉపాద్యాక్షులు తుమ్మల వేణు, ఎలమకంటి భుజంగం, జలగం రవి, ఉప్పునూతల శ్రీనివాస్, కొండేటి శ్రీనివాస్ ,కొండేటి రవి ,ఐతరాజు, జలగం సామెల్, సుమన్, శ్రీకాంత్, పులి బాబు ,ఎలమకంటి వెణు, వెంకన్న, సుమన్, వెంకన్న, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటిద్దాం

- **పిలుపునిచ్చిన రాపర్తి సోమయ్య, వడ్లకొండ సుధాకర్**

**తరంగాలు ప్రతినిది–జఫర్గడ్**

కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న ప్రజావ్యతిరేక విధానాలను ప్రతిఘటించాలని రైతు సంఘం జిల్లా అధ్యక్షులు, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా సహాయ కార్యదర్శి రాపర్తి సోమయ్య, వడ్లకొండ సుధాకర్లు పిలుపునిచ్చారు. మంగళవారం జఫర్గడ్ మండల కేంద్రంలో వీధుల గుండా బైక్ ర్యాలీ నిర్వహిస్తూ పెద్ద ఎత్తున కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కేంద్రంలో పదేళ్లుగా అధికారంలో ఉన్న బిజెపి ప్రభుత్వం అనేక ప్రజావ్యతిరేక విధానాల అవలంబిస్తుందని, ప్రజలకు అవసరమైనటువంటి నిత్యవసర సరుకుల ధరలు పెంచి ప్రజలను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆరోపించారు. ప్రభుత్వ రంగ సంస్థలైన రవాణా రంగంలో రైల్వే, రోడ్లు, విమానాలు, బొగ్గు, మైనింగ్, ఓడరేవులను, ఎల్ఐసి, టెలికం రంగాలను మానిటైజేషన్ పైప్ లైన్ పేరుతో దేశంలోని పెద్దపెద్ద కార్పోరేట్ సంస్థలకు కట్టబెడుతున్నారని ధ్వజమెత్తారు. కార్మిక రంగాన్ని దెబ్బతీసి కార్మిక హక్కులను కాలరాస్తూ కొట్లాడి సాధించుకున్న కార్మిక చట్టాలు రద్దుచేసి కార్మికులను చీకటి రోజులకు నెట్టి కార్మికులతో వెట్టిచాకిరి చేయించే 4లేబర్ కోడ్ లను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని నిర్వీర్యం చేసే ప్రయత్నం చేస్తుందని ఆరోపించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకాన్ని వంద రోజుల నుండి 200 కు పెంచాలని వారన్నారు. వ్యవసాయ రంగాన్ని నిర్వీర్యం చేసేందుకు రైతు వ్యతిరేక చట్టాలను తీసుకువచ్చి రైతుల నడ్డి విరిచే ప్రయత్నం చేయగా రైతాంగమంతా ఏకమై దేశ రాజధాని ఢిల్లీ కేంద్రంగా సంవత్సర కాలం పాటు రైతులు చారిత్రక పోరాటం చేసినల్లచట్టాలను వెనక్కి తిప్పి కొట్టారని అన్నారు. సమస్యలన్నింటిని ప్రజల్లోకి తీసుకెళ్లి ఫిబ్రవరి 16న దేశవ్యాప్త సమ్మె గ్రామీణ భారత్ బంద్ ను జయప్రదం చేయాలని వారు కోరారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం మండల కార్యదర్శి నక్క యాకయ్య, సిఐటి యాతం సమ్మయ్య, ప్రజా సంఘాల నాయకులు కాట సుధాకర్, గుండెబోయిన రాజు, వేల్పుల పెద్ద రాములు, రవి, శీను, సోమయ్య, ముక్కెర రాజు, ఎండి శంషుద్దీన్, పాల్గొన్నారు.




# టి.ఎస్.ఎస్.టి.ఎఫ్ జనగామ జిల్లా నూతన కమిటీ ఎన్నిక

- **తెలంగాణ సాంఘిక శాస్త్ర ఫోరంజిల్లా అధ్యక్షునిగా కనకయ్య**

**తరంగాలు ప్రతినిధి–జఫర్గడ్**

తెలంగాణ సోషల్ స్టడీస్ టీచర్స్ ఫోరం టి ఎస్ ఎస్ టి ఎఫ్ జనగామ జిల్లా నూతన కమిటీ ఎన్నిక సోమవారం జరిగింది. టి ఎస్ ఎస్ టి ఎఫ్ రాష్ట్ర బాధ్యుల సూచన మేరకు జనగామ జిల్లా టిఎస్ఎస్ టి ఎఫ్ అభ్యర్థులందరు సమావేశం ఏర్పాటు చేసుకొని జిల్లా స్థాయి నూతన కమిటీని ఎన్నుకున్నారు. టి ఎస్ ఎస్ టి ఎఫ్ జనగామ జిల్లా అధ్యక్షునిగా యం.కనకయ్య, జనరల్ సెక్రెటరీ యం.శుభాష్ , ఉపాధ్యక్షులు రేచవేణి కిరణ్ కుమార్, మహిళా ఉపాధ్యక్షురాలు యం. ఝాన్సీ, కార్యదర్శి పి ప్రవీణ్ కుమార్ ,కోశాధికారి యం. విజయ్ కుమార్ , ఎన్నికవ్వడం జరిగింది. అలాగే జిల్లాలోని ప్రతి మండలం నుండి ఒకరిని జిల్లా ఎగ్జిక్యూటివ్ మెంబర్లుగా, మరొకరిని మండల బాధ్యులుగా ఎన్నుకోవడం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా అధ్యక్షులు కనకయ్య మాట్లాడుతూ టిఎస్ఎస్ టిఎఫ్ ప్రధాన ఉద్దేశం సామాజిక అవగాహన కలిగిన విద్యార్థులలోని ప్రతిభా పాఠవాలను వెలికితీస్తూ, విలువలతో కూడిన సామాజిక పరిణామాల దిశగా విద్యార్థులను తీర్చిదిద్దడం అని అన్నారు.జిల్లాలోని సోషల్ ఉపాధ్యాయుల సమన్వయం సంఘటితం కావడానికిటి ఎస్ ఎస్ టి ఎఫ్ సర్వవిధాల కృషి చేస్తుందని తెలియజేశారు. ఈ సందర్భంగా నూతన కమిటీగా ఎన్నికైన టి ఎస్ ఎస్ టి ఎఫ్ కమిటీకి ఉపాధ్యాయులు శుభాకాంక్షలు తెలియజేయగా నూతన కమిటీ బాధ్యతలు స్వీకరించిన ఉపాధ్యాయులు ఎన్నికల్లో పాల్గొన్న ఉపాధ్యాయులందరికీ కృతజ్ఞతలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో జిల్లాలోని సోషల్ టీచర్లు, పాల్గొన్నారు.

## లివ్ ఇన్ ఏ హెల్తీ స్పేస్ లో ప్రపంచ ఛాంపియన్‌గా శ్రీ చైతన్య




**తరంగాలు /హన్మకొండ ప్రతినిధి:** నాసాకు చెందిన నేషనల్ స్పేస్ సొసైటీ (ఎన్ ఎస్ ఎస్) వారు నిర్వహించిన లివ్ ఇన్ ఏ హెల్తీ స్పేస్ పోటీల్లో శ్రీ చైతన్య స్కూల్ ప్రపంచ ఛాంపియన్ గా నిలిచింది.ప్రపంచవ్యాప్తంగా 12-18 ఏళ్ల వయస్సు కలిగిన విద్యార్థులకు స్పేస్ సెటిల్ మెంట్ లో అగ్రికల్చర్ మాడ్యుల్ డిజైన్ పై జరుపిన పోటీలకు సంబదించిన ఫలితాలను ఎన్ఎస్ఎస్ సోమవారం ప్రకటించారు. ప్రపంచవ్యాప్తంగా 47 ప్రాజెక్టులు ఎంపికవగా అందులో 28 ప్రాజెక్టులు శ్రీ చైతన్యకు చెందినవే, అందులో భాగంగా హన్మకొండలోని శ్రీ చైతన్య స్కూల్ కిషన్ పుర బ్రాంచ్ 8వ తరగతి విద్యార్థులు అజ్లాన్ పాషా,హాని బోయిని, సహస్ర,సాయి కీర్తి,బాల త్రిపుర సుందరీ,లక్ష్మి గాయత్రి,రితిక లు చేసిన ప్రాజెక్టు ప్రపంచవ్యాప్తంగా 2వ స్థానంలో నిలిచారని స్కూల్ ప్రిన్సిపాల్ వినయ రెడ్డి తెలిపారు. ఈ కార్యక్రమంలో ముఖ్య భూమిక పోషించిన ఉపాధ్యాయులకు,తల్లిదండ్రులకు,స్కూల్ నాసా ఇంఛార్జి రజిత,డీన్ ప్రవీణ్,సి - ఇంఛార్జి లుబీనా,అకడమిక్ కో-ఆర్డినేటర్ మహేష్,ఎ జి మ్ రాజేశ్వర్ రెడ్డి,డైరెక్టర్ శ్రీధర్, శ్రీవిద్య లకు ధన్యవాదాలు కృతజ్ఞతలు తెలిపారు.

## మడికొండ టెక్స్ టైల్ పార్క్‌లో జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ జరిపిస్తా

- వర్ధన్నపేట ఎమ్మెల్యే కె.ఆర్ నాగరాజు



**తరంగాలు /హనుమకొండ జిల్లా ప్రతినిధి** టెక్స్ టైల్ పార్కులో నిరక్షరాస్యులైన లబ్ధిదారులకు జరిగిన అన్యాయం పై విచారణ జరిపిస్తానని హామీ ఇచ్చిన వర్ధన్నపేట ఎమ్మెల్యే కే ఆర్ నాగరాజు హనుమకొండ జిల్లా మడికొండ టెక్స్ టైల్ పార్కులో బిల్డర్స్ బ్యాంకర్స్ సొసైటీ పాలకవర్గం చేతిలో మోసపోయిన బాధిత సభ్యులు మంగళవారము ఎమ్మెల్యే నాగరాజును కలిసి వినతి పత్రం సమర్పించారు స్పందించిన ఎమ్మెల్యే జరిగిన అవినీతి అక్రమాలపై విచారణ చేపట్టేందుకు చర్యలు తీసుకుంటానని తెలిపారు మడికొండ టెక్స్ టైల్ లో జరిగిన అవినీతి అక్రమాలు తన దృష్టికి వచ్చాయని గుర్తుకు తెచ్చారు అసెంబ్లీ సమావేశాల అనంతరం కార్యాచరణ మొదలు పెడతానని ఆయన పేర్కొన్నారు మోసపోయిన సభ్యులు పి లక్ష్మీనారాయణ, బోద్దుల శ్రీను గుంటి ఐలయ్య. నల్ల కేశవులు గందె యాదగిరి కుమ్మరి కుంట్ల రాజన్న ఆముదాల కుమారస్వామి శంకరయ్య టి శంకర్రావు గోపి బెల్లం శ్రీను తో పాటు 50 మంది బాధిత సభ్యులు పాల్గొన్నారు

## బాల్క సుమన్ దిష్టిబొమ్మ దహనం



**తరంగాలు /హన్మకొండ ప్రతినిధి:** పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్ రెడ్డి ఆదేశాల మేరకు హనుమకొండ జిల్లా ఎన్ ఎస్ యు ఐ అధ్యక్షుడు పల్లకొండ సతీష్ మాట్లాడుతూ...కాకతీయ యూనివర్సిటీ రెండవ గేటు వద్ద ఎన్ ఎస్ యు ఐ విద్యార్థి సంఘం ఆధ్వర్యంలో గౌరవనీయులు తెలంగాణ ముఖ్యమంత్రి ఎన్నుమూల రేవంత్ రెడ్డి పై చేసినటువంటి అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తూ మాజీ శాసనసభ్యులు బాల్క సుమన్ పై వెంటనే చటపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు అదేవిధంగా కాకతీయ యూనివర్సిటీ ఎన్ ఎస్ యు ఐ ప్రెసిడెంట్ మోహమ్మద్ పాషా మాట్లాడుతూ విద్యార్థి నిరుద్యోగుల 1200 మంది బలిదానాల శవాల పైన గద్దెనెక్కిన బాల్క సుమన్ మీకు కొంచెం మతిస్థిమితం ఉంటే ఆలోచించి మాట్లాడాలి అనవసరమైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లో లేదు యూనివర్సిటీ లు అన్నీ ఏకమై దాడులకైనా వెనకాడ బొమ్మ అని హెచ్చరికలు జారీ చేస్తున్నాం .కేసీఆర్ కేటీఆర్ మోచేతి నీళ్లు తాగి వల్ల చెప్పులు మోసి వాళ్లకి కింద బానిస బతుకు బతికినటువంటి బాల్క సుమన్ మతిస్థిమితం లేకుండా ఇష్టం వచ్చినట్లు మాట్లాడితే ప్రజాస్వామ్య బద్ధంగా ఎన్నుకోబడిన గౌరవనీయులు ముఖ్యమంత్రి వర్యులు ఏనుముల రేవంత్ రెడ్డి పైన అనుచిత వ్యాఖ్యలు చేస్తే ఎట్టి పరిస్థితుల్లో ఊరుకోమని నిన్ను ఎక్కడ కూడా బయట తిరగనియం మీ ఇంటి పైన దాడులకు ఐన సిద్ధమని హెచ్చరిక జారీ చేస్తున్నాం. ఈ కార్యక్రమంలో సెయింట్ పాల్ స్కూల్ అధినేత ఆనంద్ జిల్లా మహిళా అధ్యక్షురాలు బంక సరళ సంపత్ యాదవ్ వరంగల్ యూత్ కాంగ్రెస్ పశ్చిమ ప్రెసిడెంట్ కంచర్ల నాగరాజ్ ఎన్ ఎస్ యు ఐ సెక్రటరీ ఆనంద్ ఈస్ట్ కాన్స్టెన్సీ ప్రెసిడెంట్ ఓని శ్రావణ్ శివ సాయి సుజన్ యూత్ కాంగ్రెస్ జనరల్ సెక్రటరీ అరుణ్ స్టేట్ జనరల్ సెక్రెటరీ రాహుల్ రెడ్డి అఖిల్ సుధీర్ సునీల్ రాజ్ తదితరులు పాల్గొన్నారు.

## మేడారం శ్రీ సమ్మక్క సారలమ్మ మహా జాతర ఏర్పాట్లను పరిశీలించిన ఐటిడిఏ ప్రాజెక్ట్ అధికారి అంకిత్ ఐఏఎస్



**తరంగాలు /ములుగు జిల్లా ప్రతినిది:** మేడారం మహా జాతరకు వస్తున్న భక్తులు పుణ్య స్థానాలు ఆచరించటానికి బస్ స్టాండ్ పరిసరాలలో బ్యాటరీ ఆఫ్ టాప్స్ నీ ఓపెన్ చేయడం జరిగింది. అలాగే బస్ స్టాండ్ పరిసరాలలో చెత్త ను ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తూ వుండాలి అని అధికారులను అదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులూ లేకుండా అధికారులు అప్రమత్తంగా వుండాలి అని అప్రమత్తం గా లేకుంటే కటిన చర్యలు తీసుకోవడం జరుగుతుంది అని అధికారులను అదేశించారు. గిరిజన మ్యూజియం లో జరుగుతున్న పెయింటింగ్ పనులను పరిశీలించి గిరిజన సంప్రదాయ,సంస్కృతి ఉట్టిపడేలా పెయింటింగ్ పనులు వుండాలి అని అధికారులను అదేశించారు. ప్రాజెక్టు అధికారి ఐటీడీఏ అంకిత్ ఐపీఎస్ తో పాటు ఏ పీఓ వసంతరావు , ఎస్ ఓ రాజుకుమార్ డి ఈ సతీష్ ఉన్నారు.

## మేడారం మహా జాతర ఏర్పాట్ల పై మావోయిస్టుల లేఖ

**తరంగాలు /ములుగు జిల్లా ప్రతినిధి** తెలంగాణ కుంభమేళాగా పేరుగాంచిన మేడారం సమ్మక్క - సారలమ్మ మహా జాతర మరికొద్దిరోజుల్లో ప్రారంభం కానుంది. ఈ క్రమంలో మేడారం జాతరపై మావోయిస్టుల లేఖ కలకలం రేపుతోంది.. మేడారం జాతరకు ఏర్పాట్లు చేయడంలో ప్రభుత్వం విఫలమైందంటూ మావోయిస్టు (జేఎమ్‌డబ్ల్యూపీ) కార్యదర్శి వెంకటేష్ పేరుతో లేఖ విడుదలైంది. మేడారం జాతరకు వచ్చిన ప్రజలకు సౌకర్యాలు లేవని.. మేడారం సమ్మక్క - సారలమ్మ జాతరను పూర్తిగా ఆదివాసి సంప్రదాయాలతోనే చేయాలని లేఖలో తెలిపారు. హిందూ సంప్రదాయాలైన లడ్డు, పులిహోర లాంటివి కాకుండా బెల్లం ప్రసాదంగా ఇవ్వాలన్నారు. జాతర



అయిన వెంటనే ఆ ప్రాంతంలో ప్రభుత్వం బాధ్యత వహించి నిధులు కేటాయించి జబ్బులు రాకుండా శుభ్రం చేయాలన్నారు. జబ్బు పడిన వారికి తగిన చికిత్సను అందించాలని డిమాండ్ చేశారు. జాతర పనుల కోసం విడిచిపెట్టిన పంట పొలాలకు నష్టపరిహారం ఇవ్వాలన్నారు. పంట పొలాల్లో బ్రాందీ సీసాలతో పాటు రకరకాల వ్యర్థ పదార్థాలు అన్నింటినీ తీసివేసే బాధ్యత ప్రభుత్వమే తీసుకుని చేయాలని మావోయిస్టులు లేఖలో పేర్కొన్నారు.

## బాల్క సుమన్ బేషరతుగా క్షమాపణ చెప్పాలి

**గోపాలపురం కాంగ్రెస్ నాయకులు,న్యాయవాది కందుకూరి రజనీకాంత్**



**తరంగాలు /హనుమకొండ జిల్లా ప్రతినిధి:** తెలంగాణ రాష్ట్ర ముఖ్యమంత్రి, రేవంత్ రెడ్డి ని ఉద్దేశించి టిఆర్ఎస్ పార్టీకి చెందిన మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నాం ఉస్మానియా విద్యార్థి నాయకునిగా,తెలంగాణ ఉద్యమ నాయకుడు అని చెప్పుకునే బాల్క సుమన్ ఎన్నికల్లో ఓటమికి గురై విచక్షణ కోల్పోయి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై,కాంగ్రెస్ ప్రభుత్వాన్ని ఉద్దేశించి చేస్తున్న వ్యాఖ్యలు సిగ్గుచేటు జిల్లాలో మూడు స్థానాలను కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తల బలంతో రేవంత్ రెడ్డి నాయకత్వంలో సాధించిన గెలుపును టిఆర్ఎస్ పార్టీ నాయకత్వం జీర్ణించుకోవడంలేదు. బడుగు బలహీన వర్గాల సంక్షేమ ధ్యేయంగా,ఇచ్చిన 6 గ్యారంటీల పథకాలను అమలు చేసే దిశగా ప్రజా దీవెనలతో ముందు సాగుతున్న ప్రభుత్వ పాలనను టిఆర్ఎస్ నాయకత్వంతో పాటు జిల్లాలో మాజీ ఎమ్మెల్యేలు జీర్ణించుకోవడం లేదు సీఎం రేవంత్ రెడ్డి ని ఉద్దేశించి బాల్క సుమన్ చేసిన వ్యాఖ్యలను తక్షణమే భేషరతుగా వెనక్కి తీసుకోవాలి లేనిచో బాల్క సుమన్ కు గుణపాఠం తప్పదు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద అనుచిత వ్యాఖ్యలు చేసిన బి ఆర్ ఎస్ చిల్లర నాయకుడు బాల్కసుమన్ దిష్టి బొమ్మను వర్దన్నపేట ఎం ఎల్ ఎ కే అర్ నాగరాజు ఆదేశానుసారం గ్రేటర్ వరంగల్ జిల్లా సెక్రటరి, కాంటెస్టెడ్ కార్పొరేటర్, న్యాయవాది కందుకూరి రజినీకాంత్ ఆధ్వర్యంలో గోపాలపురం కళ్ళు మండువా నాలుగు బాటల జంక్షన్ లో బాల్క సుమన్ దిష్టి బొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో 56 వ డివిజన్ అధ్యక్షులు భీరం రవీందర్ రెడ్డి, టీపీసీసీ సెక్రటరీ కందుకూరి పూర్ణచందర్,ఓ బి సీ జిల్లా కో ఆర్డినేటర్ బొమ్మ చంద్రమౌళి గౌడ్ వర్కింగ్ ప్రెసిడెంట్ గిన్నారపు రాజు,డివిజన్ సెక్రటరీ ఇమ్మడి అశోక్ బాబు దూలం రవీందర్ గౌడ్, కాంటెస్టెడ్ ఎంపీటీసీ పులిచేరు రవి,కాలేరు గణపతి,మహిళా డివిజన్ నాయకు రాలు వియ్యల సునీత,స్వరాజ్యం సబితా,హసీనా,మానస తదితరులు పాల్గొన్నారు.

# మేడారం జాతరకు ఆరువేల ప్రత్యేక బస్సులు

**తరంగాలు ప్రతినిధి/హైదరాబాద్ :** ఆసియాలోనే అతిపెద్ద గిరిజన జాతర మేడారానికి వెళ్లే భక్తుల సౌకర్యార్థం టీఎస్ ఆర్టీసీ ప్రత్యేక ఏర్పాట్లు చేస్తుంది. భక్తులను తరలించేందుకు ఆరు వేల ప్రత్యేక బస్సులను నడపనున్నట్టు మంగళవారం ప్రకటించింది. మేడారం జాత ర 21 నుంచి 24 వరకు జరుగనుండగా భక్తుల రద్దీ దృష్ట్యా ఈ నెల 18 నుంచి 25 వరకు ప్రత్యేక బస్సులను నడుపనున్నట్టు తెలిపింది. ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం సమక్క-సారలమ్మ జాతర సందర్భంగా టీఎస్ఆర్టీసీ ఆధ్వర్యంలో జరుగుతున్న పనులను ఉన్నతాధికారు లతో కలిసి సోమవారం రవాణాశాఖ మంత్రి పొన్నం ప్రభాకర్, పంచాయతీ రాజ్‌శాఖ మంత్రి సీతక్క పరిశీలించినట్టు ఆ సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ తెలిపారు. 16న మేడారంలో టీఎస్ఆర్టీసీ బేస్‌క్యాంప్‌ను ప్రారంభిస్తామని పేర్కొన్నారు. మేడారం జాతరలో దాదాపు 14 వేల మంది ఆర్టీసీ సిబ్బంది విధులు నిర్వహిస్తారని చెప్పారు. 30 లక్షల మంది భక్తులు హాజరవుతారని అంచనా వేస్తున్నామని, భక్తుల రద్దీకి




అనుగుణంగా బస్సులు ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, ఖమ్మం, ఆదిలాబాద్ జిల్లాల నుంచి మేడారానికి భక్తుల రద్దీ ఎక్కువగా ఉంటుందని తెలిపారు. ఆయా జిల్లాల భక్తులకు సరిపడా బస్సులు ఏర్పాటు చేస్తామని సజ్జనార్ చెప్పారు.

## రంగల్ జిల్లా నర్సంపేట నియోజకవర్గ ప్రజల దాహార్తి తీర్చటానికి

**స్థానిక శాసన సభ సభ్యులు దొంతి మాధవ రెడ్డి**



**తరంగాలు /ఖానాపురం** ఖానాపూర్ మండలం అశోక్ నగర్ గ్రామ శివారులో గల నాటి దీఫ్లోరైడ్ ప్రాజెక్టు ను సందర్శించటానికి కాంగ్రెస్ పార్టీ నర్సంపేట నియోజకవర్గ కన్వీనర్, మాజీ ఎంపీపీ తక్కళ్లపెల్లి రవీందర్ రావు,నర్సంపేట మున్సిపాలిటీ పాలకవర్గం ఫ్లోర్ లీడర్, వేముల సాంబయ్య, పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు బత్తిని రాజేందర్ లను ఆదేశించటంతో వారి సూచన మేరకు సంబంధిత శాఖ ఆర్ డబ్లు యస్,డి ఈ,ఏ ఈ,ఇతర ఇంజనీరింగ్ అధికారులను వెంట తీసుకెళ్లి ప్రాజెక్టు, ఫిల్టర్ బెడ్ లను సందర్శించటం జరిగింది. డీఫ్లోరైడ్ ప్రాజెక్టు పూర్వ వైభవంతో పాటు నియోజకవర్గ ప్రజల దాహార్తి తీర్చటం ఖాయం అన్నారు.

## బండౌతపురం ప్రత్యేక అధికారిగా ఏవో రాం నర్సయ్య



**తరంగాలు ప్రతినిధి/వర్ధన్నపేట:** వర్ధన్నపేట మండలం బండౌతపురం గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా ఏవో రాం నర్సయ్య బాధ్యతలు చేపట్టారు. ఈ సందర్భంగా ప్రత్యేక అధికారిగా బాధ్యతలు తీసుకున్న ఏవో రామ్ నర్సయ్య కు పంచాయితీ కార్యదర్శి సురేష్, ఎంపీటీసీ మరుపట్ల సురేష్ శాలువా కప్పి సన్మానం చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామ ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## మేడారం ఆలయ కమిటీ అధ్యక్షుడిగా లచ్చు పటేల్



**తరంగాలు /ములుగు జిల్లా ప్రతినిది:** తాడువాయి మండలం మేడారం మహా జాతరకు ఆలయ ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా రాష్ట్ర ప్రభుత్వం తాడ్వాయి మండలం కొండపర్తి గ్రామానికి చెందిన అర్రెమ్ లచ్చు పటేల్ ని నియమించారు. లచ్చు పటేల్ మాట్లాడుతూ నన్ను ఈ మహా జాతరకు ఉత్సవ కమిటీ అధ్యక్షుడిగా నియమించినందుకు భక్తులకు ఎటువంటి అసౌకర్యాలు కలగకుండా చూస్తానని నా మీద ఉంచిన నమ్మకాన్ని రాష్ట్ర మంత్రి సీతక్కకు దేవదాయ శాఖ మంత్రి శాఖ మంత్రి కొండా సురేఖకు కృతజ్ఞతలు తెలిపుతూ నాకు ఈ అవకాశం ఇచ్చినందుకు వాళ్ళ కు రుణపడి ఉంటానని ఆయన అన్నారు

## ముఖ్యమంత్రి పై అనుచిత వ్యాక్యలను నిరసిస్తూ బాల్క సుమన్ దిష్టి బొమ్మ దహనం



**తరంగాలు /హన్మకొండ ప్రతినిధి:** ప్రియతమ నాయకులు పరకాల ఎమ్మెల్యే రేవూరి ప్రకాష్ రెడ్డి ఆదేశాల మేరకు నడికుడ మండల అధ్యక్షులు బుర్ర దేవేందర్ గౌడ్ ఆధ్వర్యంలో సోమవారం జరిగినటువంటి మంచిర్యాల జిల్లా బి ఆర్ ఎస్ విస్తృత స్థాయి సమావేశం లో రేవంత్ రెడ్డి పైన అనుచిత వాక్యాలు చేసిన బాల్క సుమన్ పై మంగళవారం రోజు నడికుడ మండలం లో కాంగ్రెస్ నాయకులు నిరసన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. బాల్క సుమన్ పార్టీ ఇంకా అధికారంలో ఉన్నట్టు భ్రమలో ఉండి బలుపు ప్రదర్శన చేయడం సరైన చర్య కాదు ఇదే బలుపు కొనసాగితే త్వరలో కాంగ్రెస్ కార్యకర్తలు నీకు దేహ శుద్ధి చేయడం తప్పదు అని హెచ్చరిస్తూ దేవాపూర్ లో దిష్టిబొమ్మ దహనం చేయడం జరిగింది. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి డాక్టర్ మలహాల్ రావు,గ్రామ అధ్యక్షులు తాళ్ల నవీన్,మండల సోషల్ మీడియా కోఆర్డినేటర్ కోడెపాక ప్రశాంత్,మండల యూత్ అధ్యక్షులు అప్పం కుమారస్వామి,మండల వర్కింగ్ ప్రెసిడెంట్ వనపర్తి నవీన్,మండలం కోశాధికారి తలగంప రాజు,మండల యువ నాయకులు పాడి వివేక్ రెడ్డి,మండల ఉపాధ్యక్షులు బొట్ల రవీందర్, నడికుడా గ్రామ కమిటీ ప్రధాన కార్యదర్శి జిల శ్రీనివాస్,గ్రామ కమిటీ అధ్యక్షులు చాడ రవీందర్ రెడ్డి,బళ్ళు రమేష్,దేవ్ రమేష్,బందెల దామోదర్,మొగిలి,సురేందర్, విజేందర్,సీనియర్ నాయకులు కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## చెరువు తూముల వద్ద నీటి దొంగలు



**తరంగాలు /మిర్యాలగూడ ప్రతినిధి :** అడవిదేవులపల్లి మండలం పరిధిలోని పలు చెరువుల నింపి భూగర్భజలాలు పెంచాలని ప్రభుత్వం ముదిమణిక్యం మేజర్ కు నీళ్లు విడుదల చేయగా తూముల వద్ద అక్రమంగా చెరువులకు కాకుండా పొలాలు మళ్ళిస్తున్నా వారి భారిన నుండి కాపలాగా పడుకున్న మండల యువజన కాంగ్రేస్ నాయకులు కొర్ర అశోక్ నాయక్. ఈ సందర్భంగా మాట్లాడుతూ మరొక్క వారం రోజులు నీటి విధుల కొనసాగాలని అప్పుడు మాత్రమే పూర్తిగా చెరువులకు నీళ్లు చేరుతాయి అని అన్నారు. కొన్ని చోట్ల ఆకతాయిలు కొందరు మద్యం సేవించి సామాన్య రైతులతో గొడవలకు దిగుతున్నారని కావున లస్కర్లతోపాటు పోలీస్ బందోబస్తీ కూడా ఉండాలని అప్పుడు మాత్రమే చివరి చెరువులు వరకు నీళ్లు చేరి చెరువులు నిండుతాయి అని అన్నారు.

# ఉపాధికి వాకిలి టెక్నికల్ సెంటర్

- టీపీసీసీ కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్



**తరంగాలు /హన్మకొండ జిల్లా ప్రతినిధి:** వరంగల్ జిల్లాలో 200 కోట్లతో ఏర్పాటు చేయనున్న టెక్నికల్ సెంటర్ హబ్ కు పర్యావరణ, దేవాదాయ ధర్మాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ కృషి అభినందనీయం అని టీపీసీసీ కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు.టెక్నికల్ సెంటర్‌ను వరంగల్ జిల్లాలో స్థాపించేందుకు రాష్ట్ర మంత్రివర్గాన్ని మంత్రి సురేఖ ఒప్పించడం పట్ల వరంగల్ నగరంలో ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నట్లు ఆయన తెలిపారు.యావత్ తెలంగాణలోనే ఏకైక టెక్నికల్ సెంటర్ ను వరంగల్ కేంద్రంగా ఏర్పాటు చేయడం అభినంద నీయమని కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు.వేలాది మంది ఉద్యోగ,ఉపాధి అవకాశాలు కల్పించను న్న టెక్నికల్ సెంటర్ నగరంలో ఏర్పాటు చేయడం వల్ల ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజల్లో హర్షాతిరేకాలు వ్యక్త మవుతున్నట్లు కొత్తపల్లి శ్రీనివాస్ తెలిపారు.వరంగల్ నగరంలో సెంటర్ ను ఏర్పాటు చేయడానికి కృషి చేసిన మంత్రి సురేఖకు అభినందనలు, ధన్యవాదాలు తెలుపుతున్నట్లు కొత్తపల్లి శ్రీనివాస్ ఒక ప్రకటనలో తెలిపారు.వరంగల్ నగర పురోభివృద్ధికి విశేష కృషి చేస్తున్న రాష్ట్ర మంత్రి కొండా సురేఖ అందివచ్చిన ప్రతీ అవకాశాన్ని వినియోగించు కుంటున్నారనీ ఆయన అన్నారు.కేంద్ర ప్రభుత్వం దేశ వ్యాప్తంగా 20 టెక్నికల్ సెంటర్ల ను ఏర్పాటు చేసేందుకు నిర్ణ యించగా,అందులో ఒక టెక్నికల్ సెంటర్ (హబ్) వరంగల్ జిల్లా ఖిలావరంగల్ మండలంలోని రంగశాయిపేట లో ఏర్పాటు కానుందనే వార్త వరంగల్ ప్రజలకు గొప్ప ఊరట ను కలిగిస్తున్న దన్నారు. మూడు దశాబ్దాల సుదీర్ఘ రాజకీయ అనుభవంతో మంత్రి సురేఖ పట్టుదలతో చేసిన ప్రయత్నాలతో వరంగల్ జిల్లా కేంద్రం లో టెక్నికల్ సెంటర్ ను ఏర్పాటు చేసేందుకు రాష్ట్ర మంత్రిమండలి అంగీకారం తెలుపడం అభినంద నీయమని టీపీసీసీ కార్యదర్శి కొత్తపల్లి శ్రీనివాస్ అన్నారు. వరంగల్ నగరంలో ఏర్పాటు చేయనున్న టెక్నికల్ సెంటర్ ప్రభావవంత మైన పాత్ర పోషించున్నద న్నారు. పలు రకాల పరిశ్రమలకు అవసర మైన సేవలను అనుసరించి టెక్నికల్ సెంటర్ శిక్షణా కార్య క్రమాల ను చేపడుతుందనీ ఆయన తెలిపారు. నిర్మాణ, ఎలక్ట్రికల్,ఫౌండ్రీ,లెదర్,గ్లాస్, స్పోర్ట్స్ వంటి వివిధ రంగాలకు టెక్నికల్ సెంటర్లు సేవలను అందిస్తాయనీ కొత్త పెల్లి శ్రీనివాస్ తెలిపారు.

# భరోసా కేంద్రాన్ని ప్రారంభించిన జిల్లా ఎస్పీ డాక్టర్ శబరీష్ ఐపిఎస్

- పోక్సో రేప్ కేసులలో పురోగతి సాధించే దిశగా పోలీస్ శాఖ అడుగులు





**తరంగాలు /ములుగు జిల్లా ప్రతినిధి:** ములుగులో 1400 చదరపు అడుగుల విస్తీర్ణంలో 5 గదులతో అద్దె భావనంలో ఏర్పాటు చేయడం జరిగింది.ఈ యొక్క భరోసా సెంటర్ ద్వారా లైంగిక వేధింపులకు గురైన మహిళలు, పిల్లలకు సమగ్ర మద్దతు అందించడం,మానసిక చికిత్స కౌన్సెలింగ్,మెడికల్ మరియు లీగల్ ప్రాసిక్యూషన్ సేవల ద్వారా సమగ్ర పద్ధతిలో భరోసా సెంటర్ సేవలు అందిస్తుంది. భరోసా సపోర్ట్ సెంటర్ హింసకు గురి అయిన భాధితులు పోలీసు స్టేషన్లు మరియు ఆసుపత్రులకు దూరంగా తిరగకుండా ఒకే చోట అన్ని రకాల సహాయం మరియు మద్దతును అందించబడుతు ంది. దీని యొక్క లక్ష్యం హింస లైంగిక వేధింపుల బారిన పడిన పిల్లలను తగ్గించడం,అత్యాచారం, పోక్సో చట్టం కేసుల బాధితులందరూ, పోలీస్ స్టేషన్లలో కేసులు నమోదు చేసిన తర్వాత వైద్య పరీక్షల తప్పనిసరి నిబంధనల కోసం భరోసా కేంద్రాలకు పంపబడింది, దీనిని 161 మరియు 164 ఐ పి సి ప్రకారం మహిళా ఎస్ ఐ చే రికార్డు చేయబడుతుంది.భరోసా కేంద్రానికి ఎన్.సుభాష్ బాబు, డి.ఎస్.పి – డి.సి.ఆర్.బి నోడల్ అధికారిగా వ్యవహరించనున్నారు.ఈ యొక్క భరోసా కేంద్రం 8 జిల్లాలలో ప్రారంభోత్సవం జరగగా మంగళవారం రోజు ములుగు జిల్లాలో జిల్లా ఎస్పీ శబరిష్ ఐపీఎస్ ప్రారంభించడం జరిగింది. ఈ కార్యక్రమంలో డి ఎస్ పి సుభాష్ బాబు సి డబ్ల్యూ సి చైర్మన్ కే.వసుధ,సి డబ్ల్యూ ఓ ప్రేమలత, డి సి పి ఓ ఓంకార్,ఎస్ ఐ కమలాకర్ పాల్గొన్నారు.

# ప్రత్యేకాధికారిగా తాహసిల్దార్ విజయ్ సాగర్

- గ్రామ పంచాయితీ సిబ్బంది తో ప్రత్యేక సమావేశం
- తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలి...



**తరంగాలు ప్రతినిధి:వర్ధన్నపేట:** గ్రామ పంచాయితీ పాలకవర్గం పదవీకాలం పూర్తి కావడంతో ప్రత్యేక అధికారులు బాధ్యతలను స్వీకరించారు. మంగళవా రం వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారిగా వర్ధన్నపేట తాహసిల్దార్ విజయ్ సాగర్ బాధ్యతలు స్వీకరించారు. అనంతరం గ్రామపంచాయతీ కార్యదర్శి,సిబ్బందితో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారం రోజులపాటు చేయవలసిన కార్యచరణను రూపొందించారు. ముఖ్యంగా సానిటేషన్ సిబ్బంది తాగునీటి సమస్య లేకుండా జాగ్రత్త వహించాలని సూచించారు. ప్రత్యేక అధికారి గా బాధితులు స్వీకరించిన తాసిల్దార్ విజయసాగర్‌కు ఎంపీటీసీ గొడిశాల శ్రీనివాస్, కార్యదర్శి రామారా



వు శాలువాతో సన్మానించారు.ఈ కార్య క్రమంలో అంగన్వాడి, ఆశ కార్యకర్తలు, గ్రామ ప్రముఖులు, తదితరులు పాల్గొన్నారు.

# ప్రజల భాగస్వామ్యంతోనే ఉత్తమ గ్రామంగా తీర్చిదిద్దా!

- మహిళా సంఘాల సహకారం మరువలేనిది
- ఆత్మీయ వీడ్కోలు సభలో తాజా మాజీ సర్పంచ్ సతీష్
- జి.పి. ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించిన ఏవో రాం నర్సయ్య



**తరంగాలు ప్రతినిధి/వర్ధన్నపేట:** ప్రజల సంపూర్ణ భాగస్వామ్యంతోనే కడారిగూడెం గ్రామానికి జాతీయస్థాయి అవార్డులు దక్కాయని, అందుకు గ్రామ ప్రజలకు, మహిళా సంఘాల ప్రతినిధులకు జీవితాంతం రుణపడి ఉంటానని తాజా మాజీ సర్పంచ్ మంద సతీష్ అన్నారు. మంగళవారం మండలంలోని కడారిగూడెంలో వ్యవసాయ అధికారి రాం నర్సయ్య గ్రామపంచాయతీ ప్రత్యేక అధికారిగా బాధ్యతలు స్వీకరించారు. అనంతరం ఏర్పాటు చేసిన జి.పి. పాలకవర్గం ఆత్మీయ వీడ్కోలు సమావేశంలో సర్పంచ్ సతీష్ తో పాటు గ్రామపంచాయతీ పాలకవర్గ సభ్యులను వివిధ శాఖల అధికారులు సిబ్బంది ప్రజలు పూలమాలలు శాలువాలతో ఘనంగా సత్కరించి మెమొంటోలను అందజేశారు. ఈ



సందర్భంగా గ్రామ ప్రత్యేక అధికారి ఏవో రాం నర్సయ్య, డిఆర్డిఏ సెర్ప్ సిసి గోలి కొమురయ్యలు మాట్లాడుతూ సర్పంచ్ సతీష్ 2019 నుండి 2024 వరకు గ్రామ అభివృద్దే ధ్యేయంగా నిరంతరం శ్రమించి కడారి గూడెం గ్రామానికి జిల్లా, రాష్ట్ర జాతీయస్థాయి లో తగిన గుర్తింపు తీసుకురావడానికి చేసిన కృషి అభినందనీయమని ఆయన చేసిన సేవలను కొనియాడారు. సతీష్ మాట్లాడుతూ... పదవి విరమణ కేవలం పదవికినని, జీవితకాలం ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందించడం కృషి చేస్తానన్నారు. ఈ సమావేశంలో పంచాయతీ వార్డు సభ్యులు,కో ఆప్షన్ మెంబర్లు, కార్యదర్శి ఇనుగాల రాజు, సిసి గోలి కొమరయ్య ,గాదె మాధవి, పింగిలి విజయ, లక్ష్మి, మహేందర్ రెడ్డి, జిల్లా సమైక్య మాజీ అధ్యక్షురాలు చెన్న సమ్మక్క, పాఠశాల ప్రధానోపాధ్యాయులు భూపాల్, వివో అధ్యక్షురాలు పద్మ, దేవరాణి, రాధిక, ఎస్ఎంసి చైర్మన్ మంద కుమార్ ,వివో ఏ గాదే హైమా, అంగన్వాడి ఆశా కార్యకర్తలు భాగ్య, సంధ్య, ఇల్లంద కారోబార్ లేదెళ్ల రాజు, గ్రామ ప్రజలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

# సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నాం...

-వర్ధన్నపేట బిఆర్ఎస్ నాయకులు...



**తరంగాలు ప్రతినిధి/వర్ధన్నపేట:** మాజీ ముఖ్యమంత్రి కెసిఆర్ పై సీఎం రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని వర్ధన్నపేట జడ్పిటిసి మార్గం బిక్షపతి అన్నారు.మంగళవారం వర్ధన్నపేట మండల కేంద్రంలో టిఆర్ఎస్ పార్టీ మండల,పట్టణ అధ్యక్షులు తూల్ల కుమారస్వామి, పులి శ్రీనివాస్ గౌడ్ ఆధ్వర్యంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు.ఈ సమావేశానికి వర్ధన్నపేట జడ్పిటిసి మార్గం బిక్షపతి ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడుతూ, మా నాయకుడు కల్వకుంట్ల చంద్రశేఖర రావు పైన రేవంత్ రెడ్డి చేసిన అనుచిత వ్యాఖ్యలను పూర్తిస్థాయిలో ఖండిస్తున్నాం అన్నారు. తెలంగాణ ఉద్యమంలో కీలక పాత్ర పోషించి చావు అంచుల దాక వెళ్లి రాష్ట్రాన్ని సాధించిన చంద్రశేఖర రావు తొమ్మిది సంవత్సరాల ఆరు నెలల పాటు ముఖ్యమంత్రిగా కొనసాగి ఏ ఒక్క ప్రతిపక్ష నాయకుడిని కూడా అవహేళనగా మాట్లాడలేదు అన్నారు. తెలంగాణ రాష్ట్రాన్ని అనతి కాలంలోనే దేశంలోనే ఒక నెంబర్ వన్ రాష్ట్రంగా అటు అభివృద్ధిలోనూ,సంక్షేమంలోనూ ముందుకు తీసుకెళ్లిన ఘనత కేసీఆర్ కు దక్కుతుందని చెప్పారు. కెసిఆర్ కొట్లాడి తెచ్చిన తెలంగాణలో నువ్వు ముఖ్యమంత్రి అవ్వడం జరిగిందని,అలాంటి నువ్వు కేసీఆర్ కించపరిచి మాట్లాడటం నీ విజ్ఞతకే వదిలేస్తున్నామని అన్నారు. గతంలో ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో మీ కాంగ్రెస్ ప్రభుత్వం జల యజ్ఞం తో ధన యజ్ఞం చేసుకున్న చరిత్ర మీది అని, మీ ప్రభుత్వంలో ఐపిఎస్ లను జైల్లో పెట్టిన నీచమైన చరిత్ర మీ కాంగ్రెస్ పార్టీకి ఉందని గుర్తు చేశారు. తెలంగాణ రాష్ట్రానికి ఒక సంస్కృతి ఉంది నీ పార్టీ ఢిల్లీలో చేసే చెంచా రాజకీయాలను స్వచ్ఛమైన తెలంగాణ రాష్ట్రంలో రుద్ద వద్దని, ఒకవేళ ఇదే కొనసాగితే నీ సీల్డ్ కవర్ పోస్ట్ ఉస్ట్ అవుతుందని హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో సిలివెరు కుమారస్వామి,పట్టణ ప్రధాన కార్యదర్శి కొండేటి శ్రీనివాస్,మాజీ మండల మహిళ అధ్యక్షురాలు బొచ్చు జ్యోతి యాదగిరి,కన్నం కుమారస్వామి, కొండేటి భాస్కర్,కంజార్ల రవీందర్,పిట్టల రాజు,మల్లెపాక భాస్కర్,నందిపాక భాస్కర్,పాక సుజాత,సింది సాయిలు, కొండే టి.రాజు,పసునూరి రమేష్ తదితరులు పాల్గొన్నారు.

# బాల్క సుమన్ నీ భాష,పద్ధతి మార్చుకో...

-రేవంత్ రెడ్డిని విమర్శించే అర్హత నీకు లేదు...

- డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ ఎంపి ఆస్పిరంట్...



**తరంగాలు ప్రతినిధి/స్టేషన్ ఘనపూర్ :** స్టేషన్ ఘనపూర్ నియోజకవర్గం వేలేరు మండల ముఖ్యనాయకులు లక్ష్మణ్ నాయక్ అమ్మ మృతి చెందగా..వారి కుటుంబాన్ని పరామర్శించారు. అనంతరం ఆక్సిడెంట్ లో గాయకడిన కుటుంబాన్ని పరామర్శించి అన్ని విధాలుగా కాంగ్రెస్ పార్టీ, ముఖ్యమంత్రి ఆదుకుంటామని హామీ ఇచ్చారు.ఈ సందర్భంగా వరంగల్ ఎంపీ ఆస్పిరెంట్ డాక్టర్ పెరుమాండ్ల రామకృష్ణ మాట్లాడుతూ మాజీ ఎమ్మెల్యే బాల్క సుమన్ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మీద చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నానన్నారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షులు సంపత్ ,జిల్లా ఎస్సి సెల్ వైస్ ప్రెసిడెంట్ భాస్కర్, సంపత్ ,నాయకులు రమేష్ ,రవి, తదితరులు పాల్గొన్నారు.

### "బాల్క సుమన్" పై వర్ధన్నపేట పోలీస్ స్టేషన్లో ఫిర్యాదు చేసిన నరుకుడు వెంకటయ్య...



**తరంగాలు ప్రతినిధి/వర్ధన్నపేట:** ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామని, బేషరతుగా సిఎం రేవంత్ రెడ్డి కి బాల్క సుమన్ క్షమాపణలు చెప్పాలని కాంగ్రెస్ పార్టీ ఎస్సీ సెల్ వరంగల్ జిల్లా అధ్యక్షులు నరుకుడు వెంకటయ్య డిమాండ్ చేశారు. మంగళవారం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పై అనుచిత వ్యాఖ్యలు చేసిన బాల్క సుమన్ పై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని వర్ధన్న పేట పోలీస్ స్టేషన్ కార్యాలయంలో ఎస్సై ప్రవీ ణ్ కుమార్‌కు పిర్యాదు చేశారు. ఈ కార్యక్ర మంలో ఎస్సీ సెల్ మండల అధ్యక్షులు మల్లేపక సమ్మయ్య,మండల అధికార ప్రతి నిధి కందిక ఎల్లస్వామి, ఎస్సీ సెల్ సీనియర్ నాయకులు దుబ్బ ఎల్లయ్య, తదితరులు పాల్గొన్నారు.

# కళ్యాణలక్ష్మీ చెక్కులు పంపిణీ చేసిన ఎమ్మెల్యే కేఆర్ నాగరాజు

**తరంగాలుప్రతినిధి/వర్ధన్నపేట:** వర్ధన్నపే ట ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో ఎమ్మార్వో విజయ్ సాగర్ ఆధ్వర్యంలో వర్ధన్నపేట మండల పరిధిలోని వివిధ గ్రామాలకు చెందిన 78 మంది కళ్యాణ లక్ష్మి , షాదీ ముబారక్ లబ్ధిదారులకు ఏర్పాటు చేసిన చెక్కుల పంపిణీ కార్యక్రమానికి వర్ధన్నపేట ఎమ్మెల్యే ,విశ్రాంత ఐపిఎస్ అధికారి కేఆర్ నాగరాజు ముఖ్య అతిథిగా హాజరై చెక్కులు అందజేశారు.ఈ కార్యక్రమంలో జడ్పిటిసి మార్గం బిక్షపతి,వర్ధన్నపేట మండల అధ్యక్షుడు ఎద్దు సత్యనారాయణ, సీనియర్ నాయకులు పోశాల వెంకన్న గౌడ్, కౌన్సిలర్ సమ్మెట



సుధీర్, , కాంగ్రెస్ పార్టీ నాయకులు కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.